


వాకిట ముత్యాల ముగ్గులు.. గుమ్మాలకు ముద్దబంతి దండలు.. ఇళ్లకు చేరుతున్న ధాన్యం, వీధుల్లో హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల ఆటలు, ఆలయాల్లో ధనుర్మాస పాశురాలు, పచ్చటి పొలాలపై పరుచుకుంటున్న పొగమంచుతో అందమైన ప్రకృతి దృశ్యాలు, ఎగురుతున్న గాలిపటాలు, ఘుమఘుమలాడే పిండి వంటలు, ఇళ్లకు చేరుతున్న బంధుమిత్రులు ఇలా.. పల్లెల్లో ఎక్కడ చూసినా సంక్రాంతి కళ కనిపిస్తోంది. ఎవరిని కదిలించినా పండుగ ముచ్చట్లే వినిపిస్తున్నాయి. ఎవరికివారు తమ బంధుమిత్రులను స్వాగతిస్తూ పండుగ ఏర్పాట్లు చేస్తూ సందడి చేస్తున్నారు. మూడు రోజుల ముచ్చటైన ఈ పెద్ద పండుగ నేడు భోగి వేడుకలతో ప్రారంభమవుతోంది.

భోగితో బోణి





- ఇరు జిల్లాల్లో సంక్రాంతి సంబురాలు షురూ
- నేడు భోగభాగ్యాల భోగి వేడుకలు..
- రేపు మకర సంక్రాంతి
- పండుగ సందడితో పల్లెలు కళకళ

ఖమ్మం సాంస్కృతికం/కొత్తగూడెం సాంస్కృతికం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సూర్యుడు ధనస్సు రాశినుంచి మకర రాశిలోకి ప్రవేశించే సందర్భంలో జరుపుకొనే పండుగే మకర సంక్రాంతి.. రైతులు తొలి పంటను తమం ఇష్ట దైవానికి సమర్పించి భక్తితో పూజలు చేస్తారు. భోగీ, సంక్రాంతి, కనుమగా మూడు రోజులపాటు జరుపుకునే ఈ పండుగ కోసం తెలుగు లోగిళ్లు సిద్ధమయ్యాయి. నేడు భోగి ఉత్సవాలు నిర్వహించనున్నారు. తెల్లవారు జామున నిద్రలేచి పాత వస్తువులతో భోగిమంటలు వేసి దాని చుట్టూ చేరి తమ కష్టాలు తొలగిపోవాలని కోరుకుంటూ భోగి స్నానాలు ఆచరిస్తారు. చిన్న పిల్లలకు తలంటూ స్నానాలు చేయించి నూతన దుస్తులు ధరింపచేసి దిష్టి తీసి భోగిపళ్లు పోస్తారు. దీనినే పేరంటాల పండుగ అంటారు. పిల్లల తలపై రేగుపళ్లను పోయటం వల్ల వారు జ్ఞానవంతులవుతారని నమ్ముతారు. సంస్కృతి సంక్రాంతి పర్వదినాల్లో తమ ఇళ్ల ముందు ముగ్గులు వేసి ఆ ముగ్గుల్లో గొబ్బెమ్మలు, రేగుపళ్ల ఏర్పాటు చేసి సంక్రాంతికి స్వాగతం పలుకుతారు. సంక్రాంతి సందర్భంగా పల్లె, పట్టణాల్లో గంగిరెద్దులు, హరిదాసుల సందడి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. హరిదాసు ఇంటింటికి తిరిగి సంకీర్తనలు చేస్తూ సంక్రాంతి వైభవాన్ని చాటిచెప్తాడు. డూడూ బసవన్నల విన్యాసాలు ఆకట్టుకుంటున్నాయి. సంక్రాంతి పండుగ అనగానే చిన్న, పెద్ద వయో భేదం లేకుండా గాలిపటాలను ఎగురవేసి చిందులు వేస్తూ సంబరాల్లో మునిగిపోతారు. వరుస సెలవులతో అంతా స్వస్థలాలకు చేరుకోవడంతో ఊర్లల్లో సందడి నెలకొంది. షాపింగ్ మాల్స్, దుకాణాల్లో మహిళల సందడి కనిపిస్తోంది. ఇళ్లలో కుటుంబ సభ్యులంతా కలిసి పిండి వంటల తీయారీలో బిజీగా ఉన్నారు. ముగ్గులు, రంగుల విక్రయకేంద్రాల వద్ద మహిళల సందడి కనిపిస్తోంది.

రేపు మకర సంక్రాంతి..

భోగి మరుసటి రోజు మంగళవారం ప్రధాన పండుగైన మకర సంక్రాంతిని జరుపుకొంటారు. ఇళ్ల ముందు పెద్దపెద్ద ముగ్గులు వేసి రంగులతో అలంకరించటంతోపాటు గొబ్బెమ్మలను అలంకరిస్తారు. సంక్రాంతిని ప్రధానంగా పట్టణాలు, నగరాలకన్నా పల్లెల్లోనే అధికంగా పాటిస్తారు. రైతులకు కొత్తపంట చేతికొచ్చే కాలం కావడంతో ఇళ్లల్లో లక్ష్మీపూజలు నిర్వహించి పాలు పొంగిస్తారు. కొత్తబట్టలు ధరించి దైవ దర్శనం చేసుకొని ఇంటిల్లిపాదీ పిండి వంటలతో విందు భోజనాలు చేస్తారు.

పశువులను పూజించే ఆచారం..

సంక్రాంతి మరుసటి రోజున 'కనుమ' పండుగ చేస్తారు. ఆ రోజు పశువులను పూజించటం అనాదిగా వస్తున్న సంప్రదాయం. వ్యవసాయంలో ప్రధాన భూమిక పోషించే పశువులను ఆ రోజు శుభ్రంగా కడిగి వాటిని రంగులతో అలంకరించి వాటికి విశ్రాంతి కల్పించటంతో పాటు దైవ స్వరూపంగా భావించి పూజిస్తారు. ఈ ఆచారం నేటికీ పల్లెల్లో పాటిస్తున్నాయి.

రహదారులపై రద్దీ..

పండుగ సందర్భంగా రాకపోకలు సాగించే వారితో ఖమ్మం, కొత్తగూడెం వంటి ప్రాంతాల అత్యంత రద్దీగా మారాయి. బస్సులు, తదితర ప్రైవేటు వాహనాలు కిక్కిరిసి వెళుతుండడంతో రోడ్లపై తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు సంభవిసున్నాయి. మరోవంక ఆంధ్రా ప్రాంతాలకు వెళ్లేందుకు ఖమ్మం జిల్లా గేట్‌వే కావటంతో ట్రాఫిక్‌రద్దీ మరింత పెరిగింది. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో కోడి పందేలు జరుగుతుండడంతో ఔత్సాహికులు ఆ ప్రాంతాలకు పయనయ్యారు.

అన్నదాతకు అండ 'మంచుకొండ'







- మంత్రి తుమ్మల కృషితో ఫలించబోతున్న రఘునాథపాలెం రైతుల కల
- నేడు ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన
- హాజరవుతున్న ఐదుగురు రాష్ట్ర మంత్రులు



ఖమ్మం, జనవరి 12(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తీవ్ర సాగునీటి సమస్య కలిగిన మండలంగా ఉన్న రఘునాథపాలెం మండల సాగునీటి సమస్య వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో ఎట్టకేలకు తీరబోతోంది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని ఏడాదిలోనే కార్యాచరణలో పెట్టి మంచుకొండ ఎత్తిపోతల పథకానికి రూ.66.33కోట్లు మంజూరు చేయించారు. సంక్రాంతికి శంకుస్థాపన చేయిస్తానని ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్రాంతికి ముందే శంకుస్థాపనకు మంత్రి తుమ్మల ఏర్పాట్లు చేయించారు.

చెంతనే సాగర్ కాలువ ఉన్నా.. నీరు కరువే..

ఖమ్మం నరగరానికి సమీపంలో ఉన్న రఘునాథపాలెం మండలం జిల్లాలోని భౌగోళికంగా ఎత్తయిన మండలంగా ఉంది. సాగర్ కాలువ సమీపంలోనే ఉన్నా గ్రావిటీతో నీరు అందే పరిస్థితి లేదు. దీంతో గతంలో ఖమ్మం ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే తుమ్మల రఘునాథపాలెం మండలానికి సాగునీటి కోసం బుగ్గవాగు ప్రాజెక్టుకు నిధులు మంజూరుచేసి పనులు చేపట్టారు. కానీ తరువాత ఆయన ఎమ్మెల్యేగా గెలవకపోవడంతో బుగ్గవాగు ప్రాజెక్టు అసంపూర్తిగానే మిగిలింది. దాంతో అక్కడి రైతులు వర్షాధారంగా బోర్లు, బావులతోనే మెట్టపంటలు సాగు చేస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల తలెత్తితే కరువుతో తీవ్రంగా నష్టపోతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తుమ్మల నాగేశ్వరరావు మళ్లీ ఖమ్మం పోటీ చేసినప్పుడు రఘునాథపాలెం మండలాన్ని గోదావరి, కృష్ణాజలాలతో సస్యశ్యామలం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో అన్ని అవకాశాలను పరిశీలించి సాగర్‌కాలవపై ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేయించారు. ఈ ఎత్తిపోతలతో 2,412 ఎకరాలకు సాగునీటితోపాటు మంచుకొండ, చిమ్మపుడి, దారేడు, పాపటపల్లి, కోటపాడు, ఈర్లపుడి, రాంక్యాతండా, బడియాతండా, చింతగుర్తి, రఘునాథపాలెం, బల్లేపల్లి, ఖానాపురం, వేపకుంట్ల, కొణిజర్ల గ్రామాల్లోని మొత్తం 27చెరువులకు నీరందించడంతో పాటు ఈర్లపుడి, గడ్డికుంట తండాలో అదనపు ఆయకట్టు కింద వ్యవసాయభూమి సాగులోకి రానుంది. వీ.వెంకటాయపాలెం పాత లిఫ్టు సమీపంలోనే మూడు 600హెచ్‌పీ మోటార్లు ఏర్పాటు చేయనున్నారు. 16.30 కిలోమీటర్ల పొడవున పైపు లైన్లు ఏర్పాటుచేసి మంచుకొండ వద్ద ట్యాంకు నిర్మించి సాగర్‌జలాలను మంచుకొండ ట్యాంకులో వదిలి నాలుగువైపులా పైపులైన్లతో చెరువులకు నీటి సరఫరా చేయనున్నారు.

మూడు నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యం

రఘునాథపాలెం మండలాన్ని సస్యశ్యామలం చేసేందుకు నిర్మిస్తున్న మంచుకొండ ఎత్తిపోతల పథకాన్ని మూడునెలల్లోనే పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు మంత్రి తుమ్మల ఆదేశాలు ఇచ్చారు. సంక్రాంతికి శంకుస్థాపన, (మిగతా 4వ పేజీలో)

నేడు జిల్లాకు ఐదుగురు మంత్రులు

- ఖమ్మం కలెక్టరేట్‌లో అభివృద్ధి పనులపై సమీక్ష
- రూ.66.33కోట్లతో మంచుకొండ ఎత్తిపోతలకు శంకుస్థాపన

ఖమ్మం, జనవరి 12(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం జిల్లాలో సోమవారం ఐదుగురు రాష్ట్ర మంత్రులు పర్యటించనున్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఖమ్మం చేరుకుని కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటలనుంచి 12గంటల వరకు రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల పంపిణీపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. గ్రామసభల నిర్వహణ, లబ్ధిదారుల ఎంపికపై అనుసరించాల్సిన విధివిధానాలను అధికారులకు వివరించనున్నారు. మధ్యాహ్నం 1:30గంటలకు రఘునాథపాలెం (మిగతా 4వ పేజీలో)

ఇదే ఇందిరమ్మ మోడల్ హౌస్

- కూసుమంచిలో మొదటి ఇంటి నిర్మాణం పూర్తి
- నేడు ప్రారంభించనున్న మంత్రి పొంగులేటి



కూసుమంచి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అందరూ ఎదురుచూస్తున్న ఇందిరమ్మ ఇంటి మొదటి మోడల్‌హౌస్ నిర్మాణం పూర్తయ్యింది. గృహనిర్మాణ, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం ఉదయం ఏడుగంటలకు ఈ ఇంటిని లాంఛనంగా ప్రారంభించనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్హులైన ప్రతిఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని హామీ ఇచ్చింది. ఈ క్రమంలో అర్హులను సర్వే ద్వారా గుర్తిస్తోంది. ఈ నేపథ్యంలోనే ప్రతి మండల కేంద్రంలోనూ రూ.5లక్షల వ్యయంలో ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను నిర్మించాలని తలపెట్టింది. అందులో భాగంగా మంత్రి పొంగులేటి డిసెంబరు 13న కూసుమంచిలో మోడల్‌హౌస్‌కు శంకుస్థాపన చేశారు. నెలరోజుల వ్యవధిలో ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేశారు. సుమారు 50 గజాల స్థలంలో రూ.5లక్షల వ్యయంతో ఈ ఇంటిని నిర్మించారు. ఇందులో హాల్, కిచెన్, బెడ్‌రూం, అటాచ్డ్ బాత్‌రూం ఉండేలా ఇందిరమ్మ గృహాన్ని నిర్మించారు. సుమారు 50 గజాల స్థలంలో రూ.5లక్షల వ్యయంతో ఇంటిని నిర్మించాలని తలపెట్టగా ఇంటిస్లాబ్‌పై కంటిగోడ నిర్మాణానికి, ముందుభాగాన చిన్న వరండా నిర్మాణానికి సుమారు రూ.లక్ష అదనంగా ఖర్చయినట్లు అధికారులు తెలిపారు.

వాడిన మెటీరియల్ ఇలా..

ఈ ఇంటి నిర్మాణానికి 10 ట్రాక్టర్ల ఇసుక, 20 ఎంఎం కంకర ఆరు యూనిట్లు, 40ఎంఎం కంకర ఒక యూనిట్, (మిగతా 4వ పేజీలో)

మంత్రి పొంగులేటికి తప్పిన ప్రమాదం

- ఆయన ప్రయాణిస్తున్న కారు రెండు టైర్లు బరస్ట్
- డ్రైవర్ అప్రమత్తం కావడంతో తప్పిన ప్రమాదం
- ఎస్కార్ట్ వాహనంలో ఖమ్మం చేరుకున్న మంత్రి
- తిరుమలాయపాలెం సమీపంలో ఘటన


పేలిన కారు టైరు


మరో వాహనంలో వెళ్లిపోతున్న మంత్రి పొంగులేటి

ఖమ్మం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ప్రమాదం తప్పింది. ఆయన ప్రయాణిస్తున్న కారు రెండు టైర్లు పేలడంతో డ్రైవర్ అప్రమత్తమై కారును అదుపులోకి తీసుకొచ్చి పక్కకు నిలపడంతో ప్రమాదం తప్పింది. ఇన్‌చార్జ్ మంత్రి హోదాలో ఆదివారం ఆయన వరంగల్‌లో ఆ జిల్లా సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, మార్క్ ఫెడ్ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్యతో కలిసి మంత్రి పొంగులేటి తన కారులో ఖమ్మం బయలుదేరారు. ఈ క్రమంలో రాత్రి 8.45 గంటల సమయంలో ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం చింతపల్లి గ్రామాల మధ్యలో ఆయన ప్రయాణిస్తున్న కారు రెండు టైర్లు పేలాయి. దాంతో డ్రైవర్ అప్రమత్తమై కారు రోడ్డు మీద నిలిపేశారు. దాంతో ప్రమాదం తప్పింది. అనంతరం మంత్రి తన అనుచరులు, పోలీస్ ఎస్కార్ట్ వాహనంలో ఖమ్మంలోని తన నివాసానికి చేరుకున్నారు. కారు ప్రమాదం తప్పటంతో ఆయన అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు.


మాట్లాడుతున్న ఈవో రమాదేవి

సమష్టి కృషితోనే ముక్కోటి విజయవంతం

- వాగ్గేయకారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం
- భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి

భద్రాచలం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి దేవస్థానం సిబ్బంది, వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల సమష్టి కృషితో ముక్కోటి మహోత్సవాలను, ఏరు పండుగను విజయవంతంగా నిర్వహించామని భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి తెలిపారు. భద్రాచలంలోని చిత్రకూట మండపంలో ఆదివారం మీడియా ప్రతినిధులకు తొలిసారిగా దేవస్థానం ఆధ్వర్యంలో వైదిక సిబ్బందితో వేద ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా జరిగిన (మిగతా 4వ పేజీలో)

భూవివాదాల పరిష్కారానికి కార్యాచరణ చేపట్టండి

- మున్నేరు రిటైనింగ్‌వాల్‌కు భూసేకరణ వేగవంతం చేయండి
- సమీక్ష సమావేశంలో రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి

ఖమ్మంటౌన్, జనవరి11 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ, అటవీ భూవివాదాల పరిష్కారానికి కార్యాచరణ చేపట్టాలని రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఖమ్మం నగరంలోని తన నివాసంలో ఆదివారం ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, స్థానికసంస్థల అదనపు కలెక్టర్ పీ.శ్రీజలతో కలిసి రెవెన్యూ, అటవీశాఖ, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేసిన అసైన్‌మెంట్ పట్టాల్లో గత 40ఏళ్లుగా క్షేత్రస్థాయిలో రైతులు సాగు చేస్తున్నారని, రైతులకు ఉన్న భూసమస్యలు రెవెన్యూ, అటవీ అధికారులు సమన్వయంతో పనిచేసి పరిష్కరించాలన్నారు. జిల్లాలో 15 సర్వేనెంబర్లలో 1,500 ఎకరాల రెవెన్యూ, అటవీ భూముల సరిహద్దు సమస్య ఉందని, దీనిని సర్వే ద్వారా పరిష్కారం చేయాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలను పక్కాగా సేకరించి నమోదు చేయాలన్నారు. జిల్లాలో క్వారీల కోసం కేటాయించిన భూముల వివరాలను పరిశీలించాలని మంత్రి కలెక్టర్‌కు సూచించారు. అక్రమంగా నిర్వహించే క్వారీలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమీక్షా సమావేశంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు లక్షన్నర ఎకరాల్లో అటవీభూమి ఉందని, వీటిలో కొన్ని సర్వేల్లో సమస్యలు ఉన్నాయని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, ఆర్డీవోలు నర్సింహారావు, రాజేందర్, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, ఖమ్మం అర్బన్, రూరల్ తహసీల్దార్లు రవికుమార్, రాంప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

మున్నేరు రిటైనింగ్‌వాల్‌కు భూసేకరణ వేగవంతం చేయండి

ఖమ్మం నగర పరిధిలో మున్నేరుకు ఇరువైపులా రిటైనింగ్‌వాల్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ వేగవంతం చేయాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి మాట్లాడుతూ మున్నేరు తీరం వెంట రూ.690కోట్ల వ్యయంతో 17కిలోమీటర్ల ఆర్‌సీసీ రిటైనింగ్‌వాల్ నిర్మించనున్నామని, రెండు వైపులా అందుబాటులో ఉన్న ప్రభుత్వభూమిలో ఖమ్మంరూరల్ మండలం వైపు 5.1కిలోమీటర్లు, ఖమ్మంఅర్బన్ మండలం వైపు 1.7కిలోమీటర్లు నిర్మించవచ్చన్నారు. రిటైనింగ్‌వాల్ నిర్మాణానికి సంబంధించి సేకరించాల్సిన ప్రైవేటు భూముల విషయమై యజమానులతో చర్చించి సదరు భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలని మంత్రి తహసీల్దార్లను ఆదేశించారు. 15వ తేదీ నుంచి ప్రతిరోజు పనులను తాను పర్యవేక్షిస్తానన్నారు. సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఈ వేంకటేశ్వరరావు, ఈఈ అనన్య, ఆర్డీవో నర్సింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, అర్బన్, రూరల్ తహసీల్దార్లు రవికుమార్, రాంప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

'చింత' చేరని చుట్టాలు

- ముఖం చాటేసిన సైబీరియా కొంగలు
- రెండేళ్లుగా చింతపల్లికి రాని విదేశీ అతిథులు
- కొంగలను తరుముతున్న కోతులు 4



పాలేరు జవహర్ నవోదయ

18న నవోదయ ఆరో తరగతి ప్రవేశపరీక్ష

కూసుమంచి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలేరు జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 సంవత్సరానికిగాను ఆరోతరగతిలో ప్రవేశానికి ఈనెల 18న ఉదయం 11:30 గంటలకు ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్టు విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. విద్యాలయంలో 80 సీట్ల భర్తీకిగాను 3,213 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్టు పేర్కొన్నారు. ములుగు జిల్లాలోని వెంకటాపురం సహా ఉమ్మడి జిల్లాలో 16 పరీక్షాకేంద్రాలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ప్రవేశపరీక్ష అడ్మిట్ కార్డులను నవోదయ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. పరీక్ష రాయబోయే విద్యార్థులు వ్యక్తిగత ఆధార్‌కార్డు లేదా నివాస ధ్రువీకరణపత్రం, పరీక్ష ప్యాడ్, బ్లూ లేదా బ్లాక్ పెన్ వెంట తీసుకెళ్లాలి. ఉదయం 10:30లోపు పరీక్షాకేంద్రానికి చేరుకోవాలి. పరీక్షా కేంద్రానికి వాచ్, క్యాలిక్యులేటర్, ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురాకూడదని అభ్యర్థులు గమనించాలని ప్రిన్సిపాల్ కోరారు.

ఉపాధ్యాయులకు బెనిఫిట్స్ విడుదల చేయాలి

సత్తుపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఉన్న ఉపాధ్యాయులు, రిటైర్డ్ అయినా వారికి రావాల్సిన అన్నిరకాల బెనిఫిట్స్‌ను తక్షణమే విడుదల చేయాలని పీఆర్టీయూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డీ.వెంకటేశ్వరరావు, బీ.రవిలు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం సత్తుపల్లిలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ సంక్రాంతి కానుకగా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్, సరేండర్ లీవ్, టీఎస్‌జీఎల్‌ఐలతో పాటు గ్రాట్యూటీలను విడుదల చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా ప్రభుత్వంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు అన్ని కార్పొరేట్ ఆస్పత్రులలో చెల్లుబాటు అయ్యేట్లు హెల్త్‌కార్డులను అందజేయాలని, మెడికల్ బిల్లులను ఐఎఫ్‌ఎంఎస్ విధానంలో కాకుండా ఎస్టీవో ద్వారా చెల్లింపులు జరిగేటట్లు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బజ్జూరి వెంకటేశ్వరరావు, సంగమేశ్వరరావు, బాణోతు శ్రీనివాసరావు, భూక్యా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'చింత' చేరని చుట్టాలు



- ముఖం చాటేసిన సైబీరియా కొంగలు
- రెండేళ్లుగా చింతపల్లికి రాని విదేశీ అతిథులు
- కొంగలను తరుముతున్న కోతులు

కొంగల రాక శుభపరిణామం..

ప్రతి ఏడాది సైబీరియా నుంచి కొంగలు చింతపల్లి గ్రామానికి వచ్చి ఆరునెలలపాటు విడిది చేసి వెళితే అది శుభపరిణామంగా గ్రామస్థులు భావిస్తుంటారు. గ్రామంలోని చింతచెట్లపై గూళ్లు కట్టుకుని వాటి సంతతని పెంచుకునేవి..

ఖమ్మం రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): వేల కిలోమీటర్ల దూరం నుంచి వచ్చే సైబీరియా కొంగలు ఈ సారి ఇంకా చింతపల్లికి చేరుకోలేదు.

వందల ఏళ్లగా ప్రతీ ఏడాది ఖమ్మం రూరల్ మండలం, చింతపల్లి గ్రామానికి చేరుకుని ఆరు నెలలు విడిదిచేసి వాటి సంతతిని పెంచుకుని తిరిగి వెళ్లిపోయే చింతపల్లి అతిథులు రాలేదు. ఎప్పుడూ జనవరిలో వచ్చే కొంగలు గత రెండేళ్లనుంచి ముఖం చాటేశాయి. అయితే ఈ ఏడాది వస్తాయా? రావా? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

కొన్నేళ్ల నుంచి రాకపోకలు..

ఖమ్మం రూరల్ మండలం, చింతపల్లి గ్రామానికి కొన్నేళ్ల నుంచి సైబీరియా కొంగలు ప్రతి ఏడాది డిసెంబరులో పైలెట్ కొంగలు వచ్చి వాటికి ఇక్కడి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయా? లేవా? అని రెండు రోజులు ఉండి వసతులు చూసుకుని తిరిగి వెళ్లి జనవరి మొదటి వారంలో వేలాది కొంగలు వస్తాయి. జనవరి నుంచి జూన్ నెల వరకు సుమారు ఆరు నెలల పాటు చింతపల్లిలోని చింతచెట్లపై విడిది చేస్తాయి. వాటి సంతతిని పెంపొందించుకుని జూలై నెలలో తిరిగి సైబీరియా వెళ్లిపోతాయి. కొంగలు రాక పోతే ఆ ఏడాది పంటలు పండక, వర్షాలు రాకుండా ఉండటం, వంటి అశుభం ఏర్పడుతుందని గ్రామస్థులు విశ్వసిస్తారు.

గత రెండేళ్లుగా ముఖం చాటేశాయి...

ప్రతీ ఏడాది సైబీరియా నుంచే కొంగలు గత రెండేళ్లుగా చింతపల్లికి రాకుండా ముఖం చాటేశాయి. కొంగలు రాకపోవడంతో గ్రామంలో సందడి లేదని ప్రజలు వాపోతున్నారు. అవి చెట్లపై సందడి చేస్తుంటే పిల్లలు, పెద్దలు వాటిని చూసి ఆనందం వ్యక్తం చేసేవారు. కానీ నేటివరకు రాకపోవడంతో ఈ ఏడాది వస్తాయో.. రావో అని.. గ్రామస్థులు అంటున్నారు.

మనుషుల వలే జీవనం...

చింతపల్లికి చేరుకునే సైబీరియా కొంగలు మనుషుల వలే జీవనం సాగిస్తాయి. మగ కొంగలు ఆహారం కోసం బయటకు వెళితే ఆడ కొంగలు ఇంటి వద్ద ఉండి వాటి పిల్లలను చూసుకుంటాయి.. ఇలా మనుషుల వలే జీవనం సాగించడాన్ని చూసి గ్రామస్థులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తుంటారు..

కోతుల బెడద... చెట్లు నరకడంతో...

ప్రతీ ఏడాది సైబీరియా కొంగలు చింతపల్లికి చేరుకునేవి కానీ గత రెండేళ్లుగా రాకపోవడానికి ప్రధానంగా గ్రామంలో చింతచెట్లను నరికివేయడం, పెద్దఎత్తున కోతులు ఉండటం మూలంగానే అని తెలుస్తోంది. ప్రస్తుతం గతంలో మాదిరిగా పెద్ద మొత్తంలో చింతచెట్లు లేకపోవడంతోనే కొంగలు రావడం లేదని కొందరి అభిప్రాయం.. అయితే గ్రామ శివారులోని చెరువు చుట్టు చింతచెట్లు నాటి వాటిని సంరక్షించాలని తద్వారా కొంగలకు కూడా ఇబ్బందులు ఉండవని గ్రామస్థుల అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



కోతుల మూలంగానే రావడంలేదు

తోట వీరభద్రం, చింతపల్లి



కొన్ని వందల ఏళ్లుగా వేల కిలోమీటర్ల నుంచి నుంచి సైబీరియా కొంగలు వచ్చి చింతపల్లి గ్రామంలో ఆరు నెలలపాటు విడిది చేసేవి. వాటి రాకతో గ్రామంలో సందడి నెలకొనేది. దీంతో చింతపల్లి గ్రామం పర్యాటక కేంద్రంగా ఉండేది.. ప్రధానంగా కోతుల బెడద, చెట్లు నరకడంతో రెండేళ్లుగా కొంగలు రావడంలేదు. చెరువు కట్టపై చింతచెట్లు నాటి వాటిని సంరక్షిస్తే కొంగలకు ఇబ్బందులు ఉండవు. రెండు నెలలక్రితం రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఈ ఏడాదైనా కొంగలు చింతపల్లికి వస్తాయా లేదా అనేది వేచిచూస్తున్నాం.



ముగ్గులను పరిశీలిస్తున్న సినీ నటులు

మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి

మధిరటౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మన సంస్కృతి, సాంప్రదాయలను భావితరాలకు తెలిపేందుకు ముగ్గులు పోటీలు ఉపయోగపడతాయని అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని సినీ నటులు శ్రీనివాసరెడ్డి, మీనా కుమారి అన్నారు. ఆదివారం మధిర సందరయ్యనగర్ లో కౌన్సిర్లు మల్లాది వాసు, సవితల ఆధ్వర్యంలో జరిగిన ముగ్గుల పోటీల సందర్భంగా జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతు సంక్రాంతి అంటేనే అందరు కలుసుకొని ఆనందోత్సవాలతో చేసుకునేదని అన్నారు. సంక్రాంతి పల్లె పండుగ అని పట్టణాలలో ఉన్న వారందరు పల్లెలకు చేరుకుని మన సాంప్రదాయాలను గుర్తుచేసుకునే పండగ అని, పట్టణాలు అన్నీ పల్లెబాట పట్టే పండుగ అని అన్నారు. అనంతరం పలువురు కళాకారులు ప్రదర్శించిన నృత్యరూపాలు ఆహుతులను అలరించాయి. పోటీలలో ఖమ్మం స్తంబాద్రి హస్పటల్ వారి



ప్రదమ బహుమతి 20వేలను కోట యశోద గెలుపొందగా, రెండవ బహుమతిని శ్రీనిది కళాశాల వారు అందచేసిన 15వేలను లింగమల్ల వర్షిత, మధిర కోల్డ్ స్టోరేజి అసోషియేషన్ వారి 10వేల మూడవ బహుమతిని గూడెల్లి త్రివేణి గెలుపొందారు. అలాగే మధిర సేవా సమతి ఆధ్వర్యంలో, కృష్ణుని దేవాలయ కమిటి వారి ఆధ్వర్యంలో కూడా ముగ్గుల పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖ డిజైనర్ రష్మీటెక్ చందానీ, టివి నటిమణులు ప్రవీణ, రజిత తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంలో అలనాటి అందాల నటుడు

నగరంలో సందడి చేసిన శోభన్‌బాబు డూప్

ఖమ్మం సాంస్కృతికం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): అలనాటి అందాల నటుడు శోభన్ బాబు ఖమ్మంలో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచారు. శోభన్‌బాబు ఖమ్మంలో కనిపించటం ఏమిటనుకుంటున్నారా.. జూనియర్ శోభన్‌బాబుగా చిరపరిచితుడైన ఆంధ్రాప్రాంతంలోని మండపేటకు చెందిన ఎన్నారపు వెంకటేశ్వర్లు ఆదివారం ఖమ్మంలో సందడి చేశారు.



స్థానికులతో జూనియర్ శోభన్ బాబు

భక్త రామదాసు కళాక్షేత్రంలో ఏర్పాటైన నాదామృతం అనే సంగీత విభావరి కార్యక్రమంలో అతిథిగా పాల్గొనేందుకు ఆయనను ఆహ్వానించారు. అసలు పేరుతో కాక జూనియర్ శోభన్ బాబుగా పేరు పొందిన ఆయన స్వతహాగా నాటక కళాకారుడు, ఘంటసాల పాటల గాయకుడు, భగవద్గీత ప్రవచన కర్త కావటంతో ఆయనను ఆహ్వానించారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనతో పలువురు ఆటోగ్రాఫ్‌లు, ఫొటోలు తీసుకున్నారు.

అన్నదాతకు అండ 'మంచుకొండ'

(3వ పేజీ తరువాయి)

ఉగాదికి నీటి విడుదల లక్ష్యంతో పనులు చేపట్టబోతున్నారు. నిర్మాణ సమయం ఏడాది ఉన్నా ఉగాది నాటికి నీరు విడుదల చేస్తామని ఇటీవల మంత్రి తుమ్మల విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. గతంలో నీటిపారుదల, రోడ్లు భవనాలు, ఎక్సైజ్ వంటి శాఖల మంత్రిగా పనిచేసిన తుమ్మల జిల్లాలో అన్ని మండలాలకు లిఫ్టులు, చెరువులు, చెక్‌డ్యాంలు, ప్రాజెక్టుల ద్వారా సాగునీటి కల్పన చేసినా రఘునాథపాలెం మండలం భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా సాగునీటికి ఎలాంటి పథకాలు చేపట్టకలేకపోయారు. ప్రస్తుతం వ్యసాయశాఖమంత్రిగా ఉన్న తుమ్మల ఖమ్మం నియోజకవర్గం నుంచే ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నందున మంచుకొండ ఎత్తిపోతలకు రూపకల్పన చేసి నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పట్టుబట్టి ఈ పథకాన్ని మంజూరు చేయించారు. ఇచ్చిన మాట ప్రకారం సంక్రాంతికి శంకుస్థాపన చేయిస్తున్నారు. ఈ పథకం పూర్తయితే రఘునాథపాలెం మండలంలోని పలు గ్రామాలు సస్యశ్యామలం కానున్నాయి.

'మంచుకొండ' శిలాఫలకంపై వ్యవసాయ దృశ్యమాలిక

సాధారణంగా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రారంభ, శంకుస్థాపన శిలాఫలకాలపై సంబంధిత ప్రజాప్రతినిధుల పేర్లు ఉండడం సహజం. కానీ ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం మంచుకొండలో సోమవారం శంకుస్థాపన చేయబోతున్న మంచుకొండ ఎత్తిపోతల పథకం శిలాఫలకంపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు నీటిపారుదల శాఖ అధికారులు అందమైన వ్యవసాయ దృశ్యాలను చిత్రీకరించారు. గ్రామం, సాగునీటి వ్యవస్థ, రైతులు పొలం దున్నడం, వరినాట్లు వేయడం, ఎడ్లబండిపై ధాన్యం తరలిస్తున్న దృశ్యాలతో ఆకర్షణీయంగా ఆ శంకుస్థాపన శిలాఫలకాన్ని తీర్చిదిద్దారు.

నేడు జిల్లాకు ఐదుగురు మంత్రులు

(3వ పేజీ తరువాయి)

మండలం మంచుకొండలో రూ.66.33కోట్లతో నిర్మించనున్న ఎత్తిపోతల పథకానికి మంత్రులు శంకుస్థాపన చేస్తారు. అనంతరం అక్కడ జరిగే సభలో మంత్రులు ప్రసంగిస్తారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం పూర్తి చేసింది. మంత్రుల పర్యటన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీనాయకులు, కార్యకర్తలు నగరంలో బైక్‌ర్యాలీ నిర్వహించనున్నారు.

ఇదే ఇందిరమ్మ మోడల్ హౌస్

(3వ పేజీ తరువాయి)



600 బేస్మెంట్ రాళ్లు, 15ట్రాక్టర్ల మట్టి, 185 బ్యాగుల సిమెంట్, 760కేజీల ఐరన్, 2,000 సిమెంట్ ఇటుకలు, 600 అడుగుల టైల్స్, 3 సిమెంట్ దర్వాజలు, 5 సిమెంట్ కిటికీ దర్వాజలు, యూపీవీసీ తలుపులు 5, కిటికీలు 5, విద్యుత్ పనులకు రూ.30వేలు, టాయ్‌లెట్ పనులకు రూ.30వేలు, పెయింటింగ్‌కు రూ.22వేలు, మేస్త్రీ సెంట్రింగ్ సామగ్రికి రూ.లక్షా 35వేలు ఖర్చయినట్లు పంచాయితీ రాజ్ ఏఈ రైన్‌హార్డ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం భోగి రోజున మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతులమీదుగా ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

సమష్టి కృషితోనే ముక్కోటి విజయవంతం

(3వ పేజీ తరువాయి)

కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్ సలహాలు, సూచనలతో నిర్వహించిన కార్యక్రమాలకు భక్తుల నుంచి భారీ స్పందన వచ్చిందన్నారు. ఇదే సంప్రదాయాన్ని మున్ముందు కొనసాగించాలనే ఆకాంక్షను అధిక శాతం భక్తులు వ్యక్తం చేశారని తెలిపారు. దేవస్థానంలో నిర్వహించే కార్యక్రమాలు సంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించేందుకు ఎప్పుడు దేవస్థానం సిద్ధంగా ఉంటుందన్నారు. వచ్చే నెలలో నిర్వహించే వాగ్గేయకారోత్సవాలను సైతం శ్రీచక్రా సిమెంట్స్ సహకారంతో ఘనంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఈసారి కార్యక్రమాలను శ్రీ చక్రా సిమెంట్స్ ఒక రోజు, నాలుగు రోజులు దేవస్థానం నిర్వహిస్తుందని తెలిపారు. త్వరలో జరగనున్న శ్రీరామనవమికి సైతం కసరత్తు ప్రారంభించే దిశగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారన్నారు. దేవస్థానంలోని తమ సిబ్బంది సహాయ సహకారాలతో ఆలయపరంగా, ఆధ్యాత్మికపరంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముక్కోటి మహోత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు దేవస్థానం వైదిక సిబ్బంది వేద ఆశీర్వచనంతో పాటు స్వామివారి కండువ, లడ్డూ ప్రసాదంను అందజేశారు. ఇందుకు వారు ఈవోకు కృతజ్ఞతలు తెలుపుతూ శాలువ, బొకేను, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఏఈవోలు శ్రావణ్‌కుమార్, భవానీరామకృష్ణారావు, ప్రధాన అర్చకుడు కోటి రామస్వరూప్ రాఘవాచార్య, ముఖ్య అర్చకులు శ్రీ పెరంబుదూర్ మదన్‌మోహనాచార్యలు, వేద పండితులు చిట్టి హనుమత్‌శాస్త్రి, లింగాల రామకృష్ణ ప్రసాద్, ద్వివేదుల సత్యసాయి సన్యాసి శర్మ, మల్లూరి రవికుమార్ శర్మ, రామాయణపారాయణదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

యూరియా.. ఏదయా..?

- ప్రైవేట్ దుకాణాల్లో ఎరువుల కొరత
- సహకార సంఘాల్లో పాత నిల్వలు



వైరా, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రైవేట్ దుకాణాల్లో యూరియా దొరకడం లేదు. కేవలం సహకార సంఘాల్లో మాత్రమే యూరియా లభ్యమవుతుంది. దాదాపు పదిరోజుల నుంచి ప్రైవేట్ దుకాణాల్లో యూరియా లేక రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. రబీలో రైతులు మొక్కజొన్న, మిర్చితోపాటు ప్రస్తుతం వరిసాగు పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ఈ సమయంలో ఈ పంటల సాగుకు యూరియా ఎంతో అవసరంగా ఉంది. కేవలం మార్క్‌ఫెడ్‌లోని యూరియాను సహకార సంఘాల ద్వారా మాత్రమే రైతులకు అందుబాటులో ఉంచారు. సహకార సంఘాల్లో లభ్యమవుతున్న యూరియా గడ్డలు కట్టి ఉండటంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇవి పాత నిల్వలు కావడం వలన యూరియా బస్తాలు గడ్డకట్టిపోయాయి.

సరఫరా జరిగే తీరు ఇది...

జిల్లాకు వచ్చిన యూరియా వ్యాగన్ నుంచి 50శాతం యూరియాను మార్క్‌ఫెడ్ తీసుకుంటుంది. మిగతా 50శాతం ప్రైవేట్ డీలర్లకు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఈ 50శాతం యూరియాను సంబంధిత కంపెనీలు భారీగా లింకులు పెట్టి డిమాండ్‌తో డీలర్లు యూరియాను తీసుకొనేందుకు ముందుకు రావడం లేదు. యూరియా కంపెనీల వారు ప్రతి 220బస్తాల యూరియా లారీకి సుమారు రూ.20వేల విలువైన దుబ్బగుళికలు, సీఎంఎస్, 16-16-16, నానోడీఏపీ వంటి ఇతర ఉత్పత్తులను లింకులు పెట్టి ప్రైవేట్ డీలర్లపై భారం మోపుతుండటంతో దుకాణాల్లో యూరియా కరువైంది. డీలర్లు లింకులు నిరాకరిస్తే వారికి యూరియా ఇవ్వకుండా కంపెనీల వారు గోదాముల్లో నిల్వచేసి తమ డిమాండ్‌కు ఒప్పుకున్న వారికి మాత్రమే సరఫరా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

మార్క్‌ఫెడ్ వద్ద నిల్వలుండటంతో...

మార్క్‌ఫెడ్ వద్ద యూరియా నిల్వలుండటంతో రాష్ట్ర వ్యవసాయశాఖ నుంచి కొత్తగా యూరియా కేటాయింపులు లేకపోవడంతో తాము జిల్లాకు యూరియాను సరఫరా చేయలేకపోతున్నామని సంబంధిత కంపెనీల ప్రతినిధులు చెపుతుండటం విశేషం. 2023లో మార్క్‌ఫెడ్ సంస్థ ఆయా కంపెనీల నుంచి దాదాపు 15వేల మెట్రిక్ టన్నుల యూరియా తీసుకొని బఫర్ గోదాముల్లో నిల్వ చేసింది. ఆ యూరియాను జిల్లాలోని సహకార సంఘాలు, ఆగ్రోస్ కేంద్రాల ద్వారా సరఫరా చేసింది. అయినప్పటికీ ఇంకా దాదాపు ఏడువేల మెట్రిక్ టన్నుల యూరియా పాత నిల్వలున్నాయని అంచనా. అవి కొంతమేరకు గడ్డలు కట్టి ఉన్నందున సహకార సంఘాల ద్వారా రైతులకు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో మొక్కజొన్న, వరి, మిర్చి, చెరకు పంటలు సాగుచేస్తున్నారు. రైతులకు ఇప్పుడు యూరియా అవసరం ఎంతగానో ఉంది. ఈ తరుణంలో ప్రైవేట్ దుకాణాల్లో యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులు సొసైటీ వద్దకు వ్యయప్రయాసలకోర్చి బారులుతీరుతున్నారు. ఇప్పటికైనా సహకార సంఘాలతోపాటు తమకు సౌకర్యంగా ఉండే ప్రైవేట్ దుకాణాల్లో కూడా యూరియాను అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.

నాణ్యమైన యూరియా కావాలి

బండి గోపాలకృష్ణ, రైతు, తాటిపూడి



ప్రస్తుతం రబీ సీజన్‌లో యూరియా లభించటం లేదు. వైరా సొసైటీకి వెళ్లి యూరియాను తెచ్చుకోవాల్సి వస్తుంది. అక్కడ కూడా గడ్డలు కట్టిన యూరియా బస్తాలు మాత్రమే లభ్యమవుతున్నాయి. నాణ్యమైన యూరియా ఇవ్వడం లేదు. సొసైటీలతోపాటు రైతులకు అందుబాటులో ఉండే ప్రైవేట్ దుకాణాల్లో కూడా యూరియా నిల్వలు ఉండేలా చర్యలు తీసుకొని మాకు సరఫరా చేయాలి.

సొసైటీల్లో యూరియా దొరుకుతోంది

మయాన్ మంజూఖాన్, ఏవో, వైరా



మండలంలోని అన్ని సహకార సంఘాల్లో మార్క్‌ఫెడ్ నుంచి వచ్చిన యూరియా అందుబాటులో ఉంది. వైరాలో 80బస్తాలు దాని పరిధిలోని పాలడుగులో 444బస్తాలు, గరికపాడులో 525బస్తాలు, పూసలపాడు సొసైటీలో 450బస్తాలు అందుబాటులో ఉన్నాయి. దీంతోపాటు మరో 200టన్నుల యూరియాను వైరా, గరికపాడు, పూసలపాడు సొసైటీలకు మార్క్‌ఫెడ్ నుంచి తీసుకువచ్చేందుకు డీడీలు చెల్లించటం జరిగింది.

సరిహద్దు ఏపీలో కో'ఢీ'కి ఏర్పాట్లు

బూర్గంపాడు, జనవరి 13: ఆంధ్రప్రదేశ్‌లో విలీనమైన మండలాల్లో సంక్రాతి సంబురాల పేరిట కోడి పందేలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. వీటికి అక్కడి అధికార పార్టీ అండదండలు పుష్కలంగా ఉన్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సరిహద్దు ప్రాంతాల్లో జరిగే కోడి పందేలు చూసేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని బూర్గంపాడు, ములకలపల్లి, భద్రాచలం, దుమ్ముగూడెం, అశ్వాపురం, పాల్వంచ, మణుగూరు, అశ్వారావుపేట, దమ్మపేట మండలాలతో పాటు పలు మండలాల నుంచి వేల సంఖ్యలో పందెంరాయుళ్లు, చూసేందుకు ప్రజలు బారులు తీరుతారు. ఈ పందేల్లో లక్షల రుపాయలు చేతులు మారుతాయని పందేం రాయుళ్ల పేర్కొంటున్నారు. బూర్గంపాడు మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఆంధ్రాలోని కుక్కునూరు మండల పరిదిలో గల ఏలేరుతో పాటు, చీరవెల్లి, కుక్కునూరు, దామరచర్ల గ్రామాల్లో సంక్రాంతి సంబురాల పేరిట కోడి పందేలు నిర్వహించేందుకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలుస్తోంది.



కూక్కునూరు మండలం ఏలేరులో పందేలకు సిద్ధం చేసిన బరి

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ఖమ్మం క్రైం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఖమ్మం నగరానికి చెందిన ఓ యువకుడు మృతిచెందిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. నగరంలోని ప్రశాంతినగర్‌కు చెందిన ఉమ్మెత్తుల శ్రీనివాసరావు, గిరిజల ఏకైక కుమారుడు. కిరణ్ పద్మాకర్(28) హైదరాబాదు లోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. సంక్రాంతి సెలవులు కావడంతో ఖమ్మంలో ఉంటున్న తన తల్లి వద్దకు హైదరాబాదు నుంచి ద్విచక్రవాహనంపై ఖమ్మం బయలుదేరాడు. మార్గమధ్యలో సూర్యాపేట జిల్లా చివ్వెంల వద్ద గుర్తుతెలియని ఓ వాహనం ఢీకొని కిరణ్ పద్మాకర్ అక్కడికక్కడే మృతిచెందాడు. అది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనాస్థలం వద్దకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి వివరాలు సేకరించా రు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి ఖమ్మం వస్తున్న అన్నం సేవా సమితి నిర్వాహకులు అన్నం శ్రీనివాసరావు గమనించి మృతదేహాన్ని సూర్యాపేట ఆసుపత్రి మార్చురీకి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

బ్లూకోట్ కానిస్టేబుల్‌పై దాడి

- ముగ్గురు ఆకతాయిలపై కేసు నమోదు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జనవరి12(ఆంధ్రజ్యోతి): బ్లూకోట్ కానిస్టేబుల్‌పై ముగ్గురు ఆకతాయిలు విధులకు ఆటంకం కలిగించి దాడి చేసిన సంఘటన కొత్తగూడెం త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం వెలుగు చూసింది. విధులు నిర్వర్తిస్తున్న శేఖర్ అనే బ్లూకోట్ కానిస్టేబుల్‌పై కొత్తగూడెం పట్టణంలోని గాజులరాజం బస్తీ ఏరియాలో ఈ దాడి జరిగింది. ఈ సంఘటనలో నిందితులు ఉదయ్, పవన్, ప్రమోద్‌లపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రౌడీ మూకలు, ఆకతాయిలు రాజకీయ నాయకుల అండదండలతో విచ్చలవిడిగా రెచ్చిపోతున్నారనే వాదన బలంగా వినిపిస్తోంది.

సంక్రాంతి కప్ విజేత అనీల్ ఎలెవన్ జట్టు

దుమ్ముగూడెం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): 15 రోజులుగా ములకపాడు క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న సంక్రాతి క్రికెట్ కప్ పోటీల్లో ఫైనల్ విజేతగా అనీల్-11 భద్రాచలం జట్టు, రన్నరప్‌గా కొత్తూరు జట్టు నిలిచాయి. మూడు, నాలుగు స్థానాలను లక్ష్మీనగరం, భద్రాచలం చిన్ని ఎలెవన్ జట్లు దక్కించుకున్నాయి. మొదటి నగదు బహుమతి రూ.33వేలు, రెండో బహుమతి రూ.22వేలు, మూడో బహుమతి రూ9వేలు, నాలుగో బహుమతి రూ.5వేలతోపాటు షీల్డులను వైద్యాధికారి రుక్మాకర్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు.



సీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రమేష్

ఇంటెలిజెన్స్ ఏఎస్పీగా రామోజీ రమేష్

ఖమ్మం క్రైం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఇంటెలిజెన్స్ అడిషనల్ ఎస్పీగా రామోజీ రమేష్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఆయన బాధ్యతలు చేపట్టారు. గతంలో ఖమ్మంలో ట్రాఫిక్ ఏసీపీగా విధులు నిర్వహించిన ఆయన బదిలీపై వేరే జిల్లాకు అడిషనల్ ఎస్పీగా వెళ్లారు. తర్వాత ఖమ్మం ఇంటెలిజెన్స్ విభాగం అడిషనల్ ఎస్పీగా నియమితులయ్యారు. ఆదివారం ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



నరేష్(ఫైల్)

ఇల్లెందు రూరల్, జనవరి12 (ఆంధ్రజ్యోతి): గేదెలను తప్పించబోయి ద్విచక్రం అదుపుతప్పి డీసీఎం వాహనం కింద పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఇల్లెందు మండలం జెండాలవాగు వద్ద ఆదివారం జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఇల్లెందు మండలం లచ్చగూడెం గ్రామానికి చెందిన ఎట్టి నరేష్(28) తన ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి ఇల్లెందుకు వస్తున్నాడు. ఇల్లెందు-మహబూబాబాద్ ప్రధాన రహదారిలో జెండాలవాగు సమీపంలో నరేష్ వాహనానికి అకస్మాత్తుగా గేదెలు అడ్డుగా వచ్చాయి. వాటిని తప్పించే క్రమంలో నరేష్ అదుపుతప్పి ఎదురుగా వస్తున్న డీసీఎం వాహనాన్ని ఢీకొని దాని కింద పడిపోయాడు. వాహనం నరేష్ తలపై నుంచి వెళ్లడంతో నరేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈప్రమాదంపై ఇల్లెందు సీఐ బత్తుల సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నరేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నరేష్ భార్య స్రవంతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఊరెళుతున్నారా.. ఇంటికి టెక్ రక్షణ



- తక్కువ ధరతో భద్రమైన తాళాలు
- ఆన్‌లైన్‌లో, మార్కెట్‌లో అందుబాటు
- ఎక్కడున్నా దృశ్యాలన్నీ కళ్లముందే
- దొంగలు పడకుండా జాగ్రత్తలు
- చిన్న పరికరాలతో ఆస్తులు భద్రం

పండగకు ఊరు వెళుతున్నారా.. అయితే జాగ్రత్తగా ఉండాల్సిందే. గత కొద్ది నెలలుగా ఖమ్మం నగరంలో చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయి. పోలీసుల గస్తీ సరిగ్గా లేకనే నగరంలో వరస చోరీలు జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీసులు మాత్రం విధులలో ఉన్నాం గస్తీ పెంచాం.. అని చెబుతున్నారు. ప్రస్తుతం పెరుగుతున్న టెక్నాలజీకు తగినట్టుగా మనం ప్రతి రోజు ఫోన్ లేనిదే గడపలేం.. అందుకోసం వేలలో, లక్షలలో ఖర్చు పెడతాం.. కాని ఇళ్లను కాపాడుకునేందుకు మాత్రం తక్కువ ఖర్చులో అన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో అందుబాటులో ఉన్న థెఫ్ట్ అలారమ్స్(ఓపెన్ అలెర్ట్స్, మ్యాగ్నెట్ సెన్సార్స్) మాత్రం కొనుగోలు చేయడంలేదు. వీటిని ఉపయెగించడం వలన దొంగతనాలు జరిగే అవకాశం ఉండదు. ఏది ఏమైనా జాగ్రత్తలు తీసుకుంటూ, చిన్న పరికరాలు అమర్చుకుంటే మీ ఇంటిని కాపాడుకోవచ్చు.

ఖమ్మం క్రైం, జనవరి12(ఆంధ్రజ్యోతి): చిన్నగా ఉండే థెఫ్‌అలారం పరికరం ఇంట్లో అమర్చుకుంటే దొంగతనాల నుంచి బయటపడొచ్చు. ఈ థెఫ్ అలారం సుమారు వెయ్యి రూపాయల నుంచే ఆన్‌లైన్ లో, బయట షాపుల్లో అందుబాటులో ఉన్నాయి. వీటికి రెండు చిన్న బ్యాటరీలు వేసుకుని డోర్‌కు అమర్చిన తరువాత బాక్స్‌పై, మాన్యువల్ బుక్‌లో ఉన్న విధంగా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. తరువాత యాప్‌లో ఫోన్ నెంబర్ ద్వారా లాగిన్ అయ్యి యూనిట్‌ను యాడ్ చేసుకోవాలి. అంతే ఎవ్వరు డోర్ ఓపెన్ చేసినా యాడ్ చేసిన ఫోన్ నెంబర్‌కు అలారమ్ సౌండ్ వస్తుంది. రోజుకు ఎన్నిసార్లు డోర్ ఓపెన్ చేశామో కూడా చూపుతుంది.



సీసీ కెమెరాలతో సేఫ్



ప్రస్తుతం అతి తక్కువ ధరలో సీసీ కెమెరాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయి. రూ.1800 నుంచి ప్రారంభం అవుతన్న సీసీ కెమెరాలతో మనం ఎక్కడున్నా 24గంటలు ఫోన్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసుకుని చూడవచ్చు. ఒక వేళ ఇంటికి తాళం వేసి ఉరు వెళ్లినా కూడా ఇంట్లోకి ఎవరు వచ్చినా వారి ఫొటోలను తీసి ఫోన్‌లోని యాప్‌కు పంపుతుంది. ఇంటి పరిసరాలల ఎవరన్నా తచ్చాడుంటే కెమెరా కూడా 360డిగ్రీలు తిరుగుతూ వారు చేసే పనిని రికార్డ్ చేస్తుంది. కాకపోతే వైఫై అందుబాటులో ఉండాలి.

బైక్‌లకు అలారం తాళాలు



బైక్‌లకు అలారం తాళాలు వచ్చాయి. ఎక్కడైనా పార్కింగ్ చేసి వెళుతున్న సమయంలో ఆ తాళం అమర్చితే రక్షణగా ఉంటుంది. ఎవరైనా దొంగిలించాని ప్రయత్నిస్తే యజమానికి అప్రమత్తం చేస్తుంది. ఈ ద్విచక్ర వాహనాల అలారం లాక్ ధర సుమారు రూ.800 నుంచి అన్‌లైన్ అందుబాటులో ఉన్నాయి. వాహనాలకు జీపీఎస్ పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ఈ పరికరం అమర్చితే వాహనం లొకేషన్ యాప్‌కు వస్తుంది. ఈ జీపీఎస్ పరికరం కనిష్ఠ ధర రూ.2వేల వరకు ఉంటుంది.

ఫింగర్ ప్రింట్, ఫేస్ లాక్ తాళాలు..





ఫింగర్ ప్రింట్ తాళాలకు ఇంట్లో ఉన్న వారందరి వేలు ముద్రలు నమోదు చేసుకోవాలి. వారు మాత్రమే తాళం తెరవడానికి అనుమతిస్తుంది. వేరే వ్యక్తులు తాళం ముట్టుకున్నా, పగలగొట్టేందుకు చూసినా వెంటనే ఫోన్‌లో అలారం వస్తుంది. ఒక్కోసారి ఫింగర్ ప్రింట్ తీసుకోకపోతే తాళం చెవి ద్వారా కాని పాస్‌వర్డ్ ద్వారా అయినా తీయవచ్చు. వీటి ధర అన్‌లైన్‌లో సుమారు రూ. 2వేల నుంచి అందుబాటులో ఉన్నాయి. అలాగే ఫేస్‌లాక్ తాళాలు కూడా అందుబాటులో ఉన్నాయి.



శుభా నాగరాజన్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రతినిధులు

కొబ్బరి అభివృద్ధి బోర్డు ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలి

అశ్వారావుపేట, జనవరి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొబ్బరి అభివృద్ధి బోర్డు ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని సీడీబీ ఛైర్మన్ శుభా నాగరాజన్‌కు తెలంగాణ కొబ్బరి ఉత్పత్తి రైతు సంఘ ప్రతినిధులు కె పుల్లయ్య, తుంబూరు మహేశ్వరరెడ్డి తదితరులు వినతి పత్రాన్ని అందజేశారు. ఆదివారం ఏపీలోని రావులపాలెంలో సీడీపీ ఫౌండేషన్ డే కార్యక్రమంలో పాల్గొన్న ఛైర్మన్‌ను తెలంగాణా రైతులు కలిసారు. ఈ సందర్భంగా బోర్డు ఏర్పాటు ఆవశ్యకతను వివరించారు. రాష్ట్రంలో 9వేల ఎకరాలలో కొబ్బరి వుందని, అందులో ఒక్క భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనే 5వేల ఎకరాల్లో విస్తరించి ఉందని, విస్తీర్ణం పెరుగుదులకు అవసరమైన హైబ్రిడైజేషన్ చేసిన మొక్కలను సరఫరా చేయాలని కోరారు. కొబ్బరి రైతులకు అన్ని రకాల రాయితీలను కల్పించాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో తుమ్మా రాంబాబు, తలశిల ప్రసాద్, పసుపులేటి ఆదినారాయణ, దొడ్డ లక్ష్మినారాయణ, బాల కేశవరావు, చక్రధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

19న మాస్టర్స్ బ్యాడ్మింటన్ ఎంపికలు



వివరాలను వెల్లడిస్తున్న బ్యాడ్మింటన్ సంఘం బాధ్యులు

ఖమ్మం స్పోర్ట్స్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ఈనెల 19న నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలోని ఇండోర్ స్టేడియంలో జిల్లా మాస్టర్స్(వెటరన్స్) షటిల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపికలు నిర్వహించనున్నామని జిల్లా బ్యాడ్మింటన్ సంఘం ఛైర్మన్, ఏసీపీ ఘంటా వెంకట్రావు పేర్కొన్నారు. ఆదివారం ఎస్పీ స్టేడియంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన పోటీల వివరాలను వెల్లడించారు. ఎంపికల్లో భాగంగా 35 నుంచి 70 సంవత్సరాల పైబడిన మహిళలు, పురుషులకు ఏజ్ గ్రూప్ ఆధారంగా సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాలలో పోటీలు నిర్వహిస్తామని, పోటీలలో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామని తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెలలో పాల్వంచలో జరిగే రాష్ట్ర స్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. పోటీలలో పాల్గొనే క్రీడాకారులు సింగిల్స్ విభాగాని రూ. 800, డబుల్స్ విభాగానికి రూ. 1,000 ఎంట్రీ ఫీజు ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ ఎంట్రీలను ఈనెల 17న సాయంత్రం వరకు 9396972349 నెంబరుకు వాట్సాప్ ద్వారా పంపాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా బ్యాడ్మింటన్ సంఘం బాధ్యులు వి. చంద్రశేఖర్, జట్ల శ్రీనివాస్, కొంగర శ్రీనివాస్, సత్యనారాయణ, లక్ష్మణ్‌రావు, పాపారావు, అనిల్, రమేష్, శ్రీనివాసరెడ్డి తదితరలు పాల్గొన్నారు.

వెయిట్‌లిఫ్టింగ్‌లో మనోళ్ల ప్రతిభ



పతకాలు సాధించిన జిల్లా వెయిట్‌లిఫ్టర్లు

ఖమ్మం స్పోర్ట్స్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): కోదాడలో ఈనెల 10 నుంచి 12 వరకు జరిగిన రాష్ట్రస్థాయి ఓపెన్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చూపి పతకాలు సాధించారు. అంతే కాకుండా అన్ని విభాగాలలో ప్రతిభ చూపిన జిల్లా క్రీడాకారులు గ్రూప్ చాంపియన్‌షిప్‌ను సైతం కైవసం చేసుకున్నారు. క్రీడాకారుడు అభిరామ్ స్ట్రాంగ్ మెన్ టైటిల్‌ను కైవసం చేసుకోగా, బాలికల విభాగంలో టోని స్ట్రాంగ్ ఉమెన్ టైటిల్‌ను సొంతం చేసుకోవడం విశేషం. అ సందర్భంగా రాష్ట్ర పోటీలలో విజయం సాధించిన జిల్లా క్రీడాకారులను జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ బాధ్యులు అభినందించారు.

వైభవంగా రాపత్తు సేవ



రాపత్తు సేవ నిర్వహిస్తున్న పండితులు

భద్రాచలం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాపత్తు సేవల్లో భాగంగా ఆదివారం అభయాంజనేయస్వామి వారి ఆలయంలో రాపత్తు సేవ నిర్వహించారు. తొలుత స్వామి వారిని ఆలయం నుంచి మేళతాళాలు, భాజభజంత్రీలు, వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ అంజనేయస్వామి వారి ఆలయంకు తీసుకొచ్చి వేదికపై స్వామి వారిని ఆసీనులను చేసారు. అనంతరం స్వామివారికి విష్వక్సేన పూజా , పుణ్యాహవచనం, తదితర ప్రత్యేక పూజలు, వేద స్వస్తి నిర్వహించారు.

హమ్మయ్య.. ప్రమాదం తప్పింది

- లారీని, బస్సును ఢీకొన్న మరో లారీ
- రెండు లారీల్లోని ముగ్గురికి గాయాలు
- చాకచక్యంగా వ్యవహరించిన ట్రావెల్స్ బస్సు డ్రైవర్
- 56 మంది ప్రయాణికులు సురక్షితం





రెండు లారీలు ఢీకొన్న దృశ్యం, ప్రమాదంతో దెబ్బతిన్న బస్సు

కొణిజర్ల, జనవరి12 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో ట్రావెల్స్ బస్సు డ్రైవర్ చాకచక్యం ప్రదర్శించడంతో 56 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు పనుల కోసం కరీంనగర్ దగ్గర రామగుండం నుంచి ఫ్లైయాష్ లోడుతో వస్తున్న లారీ కొణిజర్ల సమీపంలోకి రాగానే హైదరాబాద్ నుంచి ఒడిసా వెళుతున్న బస్సును ఢీకొట్టి, దాన్ని తప్పిస్తూ ఎదురుగా భువనేశ్వర్ నుంచి హైదరాబాద్ వస్తున్న మరో లారీని వేగంతో ఢీకొంది. ఈ ప్రమాదంతో బస్సులోని ప్రయాణికులకు గండం తప్పగా రెండులారీల్లోని ముగ్గురికి గాయాలు అయ్యాయి. ఈ సంఘటన ఆదివారం తెల్లవారుజామున కొణిజర్ల సమీపంలో చోటు చేసుకుంది.

స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం... కొణిజర్ల సమీపంలో రోడ్డు పక్కన ఓ లారీ పంచర్ అయి ఆగిఉంది. అదే సమయంలో ఒడిస్సా వెళుతున్న బస్సు డ్రైవర్ లారీని చూసి బ్రేక్ వేశాడు. బస్సు వెనుకనే ఫ్లైయాష్‌లోడుతో వస్తున్న లారీ డ్రైవర్ ఆ బస్సును ఢీకొట్టి, దానిని తప్పించబోయి ఎదురుగా భునేశ్వర నుంచి హైదరాబాద్ వస్తున్న లారీని ఢీకొట్టాడు. బస్సు డ్రైవర్ మాత్రం లారీ ఢీకొట్టగానే ముందుఆగి ఉన్న మరో లారీని తప్పిస్తూ రోడ్డు పక్క నుంచి చెట్టును తాకుకుంటూ కొంతదూరం వెళ్లి బస్సును నిలిపాడు. చెట్టును తాకే క్రమంలో బస్సు ముందు అద్దాలు ధ్వంసం అయ్యాయి. తెల్లవారుజామున కావడంతో బస్సులో ఉన్న ప్రయాణికులు నిద్రనుంచి మేల్కొని ఉలిక్కిపడ్డారు. ఎటువంటి గాయాలు కాకుండా బయటపడినందుకు ఊపిరిపీల్చుకున్నారు. సంఘటనను చూసిన బస్సులోని కొంతమంది ప్రయాణికులు డ్రైవర్ జాగ్రత్తగా నడపబట్టి ప్రాణాలతో ఉన్నామని అన్నారు. రెండులారీలలోని ఢీకొట్టిన ఫ్లైయాష్‌లోడు లారీ డ్రైవర్ ప్రదీప్‌కు, ఎదుటలారీ డ్రైవర్ ఆరీఫ్, ధర్మేందర్‌యాదవ్‌కు గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ద్వారా ఖమ్మం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సూరజ్ తెలిపారు.

తెల్లవారుజామున ప్రమాదం జరిగిన దగ్గర నుంచి ట్రాఫిక్ నిలిచింది. ఏసీపీ రహమాన్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని పొక్లెయినర్‌లతో చర్యలు చేపట్టారు. వాహనాలను రోడ్డు మీద నుంచి తప్పించే సరికి మధ్యాహ్నాం అయింది. భారీ క్రేన్‌లను కూడా తెప్పించి వాహనాలను పక్కకు పెట్టించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.



సురక్షితంగా బయటపడిన ప్రయాణికులు

గూడ్స్ రైలు ఢీ.. 13 గేదెల మృత్యువాత

కారేపల్లి, జనవరి12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం గూడ్స్ రైలు ఢీకొన్న సంఘటనలో 13పాడి గేదెలు మృత్యువాత పడగా, మరో రెండు గేదెలు కొన ఊపిరితో కొట్టుమిడుతున్నాయి. కారేపల్లికి చెందిన ఇద్దరు వ్యక్తులకు చెందిన గేదెలు మేతకోసం వెళ్లాయి. ఈ సమయంలో రైలు ట్రాక్ దాటుతుంగా డోర్నకల్ నుంచి కొత్తగూడెం వైపునకు వెళుతున్న రైలు ఢీకొంది. దీంతో గేదెల కళేబరాలు ముక్కలు, ముక్కలుగా అయ్యాయి. వాటిలో 13గేదెలు సంఘటన స్థలంలో మృత్యువాత పడ్డాయి. మరో రెండు గేదెలు కొన ఊపిరితో ఉన్నాయి. మృత్యువాత పడిన గేదెల విలువ రూ.10లక్షలకు పైగానే ఉంటుందని బాధితులు తెలిపారు.

కోడిపందేల స్థావరాలపై డ్రోన్లతో నిఘా

ఖమ్మం క్రైం/ పెనుబల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కోడిపందేలను అరికట్టేందుకు డ్రోన్ కెమెరాలతో నిఘా నిర్వహించాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశించారు. దీంతో ఆదివారం సత్తుపల్లి రూరల్ సీఐ ముత్తి లింగయ్య, టాస్క్‌ఫోర్స్ సీఐ ఎస్.తిరుపతి ఆధ్వర్యంలో డ్రోన్ కెమెరాలతో పెనుబల్లి మండలంలో కోడిపందేలు నిర్వహించే గ్రామాల్లోనూ, అంధ్రా సరిహద్దు గ్రామాల్లో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ముత్తి లింగయ్య మాట్లాడుతూ మండల, గ్రామస్థాయిల్లో టీంలను ఏర్పాటుచేసి కోడిపందేలు, పేకాటను నియంత్రించేందుకు పకడ్బందీగా ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. గత సంవత్సరం కోడిపందేలు నిర్వహించిన బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు వివరించారు.

రెండు వర్గాల పరస్పర దాడులు



సీసీ కెమెరాలో నమోదైన దాడి దృశ్యం

ఖమ్మంక్రైం, జనవరి12(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని గట్టయ్యసెంటర్‌లో రెండువర్గాలు పరస్పరం దాడులకు పాల్పడిన సంఘటన ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. నగరంలోని గట్టయ్యసెంటర్‌లో రెండువర్గాలు ఓ ఘటనలపై రాళ్లు, కర్రలతో దాడులు చేసుకున్నారు. ఒకరిపై ఒకరు పిడిగుద్దులతో రెచ్చిపోయారు. దీంతో స్థానికులు భయాందోళనకు గురై కొందరు ఆపేందుకు వెళ్లగా అయినా వారిని సైతం లెక్కచేయలేదు. కాగా ఈసంఘటనలకు పాల్పడిన వీడియో సోషల్‌మీడియాలో హల్‌చల్ చేయడంతో పోలీసులు వారిలో కొందరిని గుర్తించి అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది.

ఘనంగా పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవం

- అతిథి మర్యాదలు, ఆత్మీయ పలకరింపులు..
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- గురువులకు ఘన సన్మానం



మాట్లాడుతున్న కమిటీ కన్వీనర్ బ్రహ్మారెడ్డి

పినపాక, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏడూళ్ల బయ్యారం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గత 50 ఏళ్లలో ఆ పాఠశాలలో విద్యనభ్యసించి హాజరైన వారికి పూర్వ విద్యార్థుల కార్యనిర్వాహక కమిటీ సభ్యులు మర్యాదలు చేశారు. వచ్చిన వారు ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకుని అలనాటి సంగతులను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ కన్వీనర్ ఎస్. బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ జాతీయస్థాయిలో అత్యున్నత సర్వీసుల్లో సేవలు అందిస్తున్న ఐఆర్ఎస్‌లు రాయ వెంకటేశ్వర రెడ్డి, కంది ప్రవీణ్, జడ్పీ సీఈవోగా విధులు నిర్వహిస్తున్న హరిహరనాథ్, ఎన్నారైలుగా స్థిరపడ్డ కంది విశ్వభరత్‌లతోపాటు పలువురు వైద్యులు ఇంజనీర్లు, ఉపాధ్యాయులు, న్యాయవాదులుగా, వ్యాపారవేత్తలు, ప్రజాప్రతినిదులుగా ఈ పాఠశాల నుంచి చదువుకుని మంచి ప్రయోజకులుగా తయారయ్యారన్నారు. అనంతరం ఐఆర్ఎస్‌లు రాయ వెంకటేశ్వరెడ్డి, కంది ప్రవీణ్ మాట్లాడుతూ ఈ పాఠశాల నుంచి ఎంతో మంది విద్యావంతులు అత్యున్నత స్థాయిలో ఉన్నారని, భవిష్యత్‌లో ఇంకా ఎందరో విద్యావంతులు తయారు కావాలనే ఉద్దేశంతో పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని, పాఠశాలకు శాశ్వత క్రీడా మైదానాన్ని కూడ కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పాఠశాలలో పని చేసిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. వేడుకల సందర్భంగా నిర్వహించిన క్రీడాపోటీల్లో విజేతగా నిలిచిన వారికి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి సుమారు 5వేల మంది హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.



తుమ్మలకు వినతులు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొండరెడ్లకు బాసటగా మంత్రి తుమ్మల

దమ్మపేట, జనవరి 12(ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి అమడ దూరంలో ఉన్న పూసుకుంట కొండరెడ్ల కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నెల రోజుల క్రితం ఆగ్రామాన్ని జిల్లా అధికారులతో కలసి సందర్శించి అభివృద్ధి ప్రణాళికలు రూపొందించారు. హామీ మేరకు నెల రోజులలో సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాలని కలెక్టర్, ఐటీడీఏ పీవోలను ఆదేశించారు. తుమ్మల ఆదేశాలమేరకు కలెక్టర్ జితేష్ వి. పాటిల్, పీవో రాహుల్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ అనుకున్న సమయానికి ముందే అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిచేశారు. పూసుకుంట గ్రామవాసులకు సంక్రాతి పండుగ కానుకగా వ్యవసాయబోర్లు వేసి, విద్యుత్ సర్వీసులను వేయటంతో పాటు రైతులకు పామాయిల్ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టి కొండరెడ్లకు బాసటగా నిలిచారని మంత్రి తుమ్మలను కొండరెడ్లు కొనియాడుతున్నారు. ఈసందర్భంగా గండుగులపల్లిలో ఆయన నివాసంలో ఆదివారం తుమ్మల మాట్లాడుతూ పూసుకుంట గ్రామంలో అనుకున్న సమయానికంటే ముందుగానే అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేసేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, కలెక్టర్, ఐటీడీఏ పీవోతో పాటు అధికారులను అభివృద్ధి పనులను గ్రామస్థులతో కలసి సమన్వయం చేసిన కొయ్యల అచ్యుతరావు, ఆలపాటి రాంచంద్రప్రసాద్, సొసైటీ ఛైర్మన్ ఎల్లిన రాఘవరావు కాసాని నాగప్రసాదు, ఎర్రా వసంతరావు, కేవీ సత్యనారాయణ, తదితరులను తుమ్మల అభినందించారు. గండుగులపల్లిలో పలువురు కాంగ్రెస్ నాయకులు తుమ్మలను కలిసి సమస్యలు పరిష్కరించాలని వినతులు అందజేశారు.

జమలాపురం శ్రీవారి సన్నిధిలో మంత్రి పొంగులేటి సతీమణి పూజలు



ఆలయంలో పొంగులేటి మాధురి

ఎర్రుపాలెం, జనవరి12 (ఆంధ్రజ్యోతి): జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీమణి మాధురి ఆదివారం శ్రీవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమెను ఆలయంలోకి స్వాగతించి ఆశీర్వచనం అందించారు. శ్రీవారి ప్రసాదాన్ని, శేషవస్త్రాలను బహూకరించారు. అనంతరం తక్కెళ్లపాడు శ్రీ లలితారాజరాజేశ్వరి ఆలయాన్ని దర్శించి పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కోట రాంబాబు, డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వర్‌రెడ్డి, అంకసాల శ్రీనివాసరావు బుర్రా నారాయణ, నన్నపనేని రామారావు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి బలవన్మరణం

పాల్వంచ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన సంఘటనపై పాల్వంచ టౌన్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం మునిసిపాలిటీ పరిధిలోని కరకవాగుకు చెందిన జూలా హరీష్(30) తాపీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలోనే అతిగా మద్యం సేవించి శనివారం ఇంట్లో వారికి పనిఉందని చెప్పి బయటకు వెళ్లాడు. అనంతరం అతడి స్నేహితుడు శ్రీనుకు ఫోన్ చేసి తాను పురుగుల మందు తాగానని చెప్పాడు. దీంతో అప్రమత్తమైన కుటుంబ సభ్యులు హరీష్‌ను పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడ నుంచి ఖమ్మం తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. భార్య అంజలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టౌన్ అడిషనల్ ఎస్ఐ రాఘవయ్య తెలిపారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

కూరగాయలు ధరలు
(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	20రూ.
వంకాయ	44
గుత్తి వంకాయ	50
బీరకాయ	54
పచ్చిమిర్చి	44
కాకరకాయ	48
బెండకాయ	48
పొట్లకాయ	34
దోసకాయ	34-48
నాటుచిక్కుడు	98
గోరుచిక్కుడు	48
క్యాబేజీ	24
దొండ	58-64
సొరకాయ	20
క్యారెట్	50
క్యాప్సికం	54
ఆలుగడ్డ	30
ఉల్లిగడ్డ	40-50
కోడిగుడ్లు ట్రే (30 గుడ్లు)	160
కొత్తిమీర కట్ట	20

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

CINEMA సినిమా

నగరంలో చిత్రాలు..

వినోద:	గేం చేంజర్
శ్రీనివాస:	డాకు మహరాజ్
సాయిరాం:	డాకు మహరాజ్
కేపీఎస్:	గేం చేంజర్
తిరుమల:	డాకు మహరాజ్
సినీగెలాక్సీ:	యుఐ

ఎత్తిపోతలకు నిర్లక్ష్యపు జాఢ్యం

» పాలేరు వరదల్లో నీటమునిగిన నర్సింహులగూడెం లిఫ్టులు » మరమ్మతులు మరిచిన అధికారులు

కూసుమంచి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కూ సుమంచి, తిరుమలాయపాలెం మండలాలకు సాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన నర్సింహులగూడెం ఎత్తిపోతల పథకాలు నిరుపయోగంగా మారాయి. గత సెప్టెంబరులో వచ్చిన వరదల్లో ఎత్తిపోతల పథకానికి చెందిన మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు నీటమునగడంతో వాటికి మరమ్మతులకు గురయ్యాయి. అయితే ఐదునెలలు గడిచినప్పటికీ నీటిపారుదలశాఖకు చెందిన అధికారులు పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి.

పాలేరు జలాశయం బ్యాక్ వాటర్ ఆధారంగా నిర్మించిన ఫేజ్-1 పథకం కొత్తూరు సమీపంలో ఉంది. ఈపథకం ద్వారా కూసుమంచి మండలంలోని నర్సింహులగూడెం, పూర్యాతండ, చౌటపల్లి, బోడియాతండ, బచ్చోడుతండా చెరువులకు, కుంటలకు నీరందుతుంది. సుమారు 200 ఎకరాలకు నీరందుతుంది. ఆయా ప్రాంతాల్లో వరిపంటకు నీరందుతుంది. ఇక్కడ ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు కాలిపోయాయి.

పాలేరు జలాశయం బ్యాక్‌వాటర్ ఆధారంగా నానుతండా వద్ద ఫేజ్-2 పథకం నిర్మితమై ఉంది. ఈపథకం ద్వారా కూసుమంచి మండలం గంగాదేవిచెరువుకు, కిష్టాపురం గణేషకుంటకు తురకగూడెం కుంటకు నీరందుతుంది. అయితే ఈ మోటార్లు గత సెప్టెంబరులో వచ్చిన వరదల్లో మోటార్లు నీటమునిగాయి. వాటికి మరమ్మతులు చేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ఉపయోగంలో లేకపోయాయి. రెండు పథకాల ద్వారా కూసుమంచి మండలం, తిరుమలాయపాలెం మండలాల్లోని సుమారు 700 ఎకరాలకు నీరందుతుంది. అయితే రెండు పథకాల్లోనూ మోటార్లు పనికిరాకుండా పోయినట్లు సమాచారం. యాసంగి పంట నాట్లు పడుతున్నందున చెరువుల్లో నీరు తగ్గుతోంది. అదేవిధంగా బోర్లు, బావుల్లో భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. అయితే వెం టనే చర్యలు చేపడితేనే పథకాలు ఉపయోగంలోకి వచ్చే అవకాశం ఉంది.



నానుతండ వద్ద నిరుపయోగంగా ఉన్న నర్సింహులగూడెం ఎత్తిపోతల పథకం

మరమ్మతులకు రూ.59లక్షలు మంజూరు
రత్నకుమారి, డీఈ, నీటిపారుదలశాఖ

నర్సింహులగూడెం ఎత్తిపోతల పథకాలు ఫేజ్-1కు రూ.19లక్షలు, ఫేజ్-2కు రూ.40లక్షలు మంజూరయ్యాయి. ఈనిధులతో మోటార్ల మరమ్మతులను పూర్తిచేయిస్తాము. అదనంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసుకువచ్చి ఫేజ్-1 వద్ద ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాము. వెంటనే పూర్తి చేసి చెరువులు నింపి, రైతులకు సాగునీరు అందిస్తాము.

అలరించిన నాదామృతం..

ఖమ్మం సాంస్కృతికం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన శ్రీతుంబుర నారద నాదామృతం సినీ సంగీత విభావరి కార్యక్రమం ఆద్యంతం ప్రేక్షకులను అలరించింది.. స్వర మధురిమ కల్చరల్స్, కేఎల్‌డీ చారిటబుల్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీ త విభావరిలో పలువురు గాయనీ గాయకులు పాల్గొని అలనాటి మేటి చిత్రాల్లోని మెలోడీ గీతాలను ఆలపించారు. సంక్రాంతి సందర్భంగా గాయనీగాయకులకు సంక్రాంతి పురస్కారాలను అందజేశారు. ఇన్‌కం ట్యాక్స్ అధికారి లావు డ్యా జీవన్ లాల్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై కళాకారులకు పురస్కారాలను అందించారు.



పాట పాడుతున్న గాయకులు

నేడు భోగి వేడుకల్లో పాల్గొననున్న మంత్రి పొంగులేటి



కూసుమంచి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ, గృహనిర్మాణ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం కూసుమంచి మండలంలో పర్యటించనున్నారు. సంక్రాంతి వేడుకల్లో భాగంగా ఉదయం 6గంటలకు కూసుమంచిలోని క్యాంపుకార్యాలయంలో భోగి వేడుకల్లో పాల్గొంటారు. 8:30గంటకలకు మండల కాంప్లెక్స్ ఆవరణలో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ హౌజ్‌ను ప్రారంభిస్తారు. 9గంటలకు దుబ్బతండాలో డబుల్ ఇళ్లను లబ్ధిదారులకు అందిస్తారు. ఉదయం 10గంటలకు రఘునాథపాలెంలో రైతు భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, ఇందిరమ్మ హౌజింగ్ పథకాల అమలుపై అధికారులతో సమీక్షిస్తారు. మధ్యాహ్నం 3గంటలకు మంచుకొండ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపనచేస్తారు.

వైద్య శిబిరం విజయవంతం

నేలకొండపల్లి, జనవరి12 (ఆంధ్రజ్యోతి): సీపీఎం సీనియర్ నాయకుడు నూతక్కి గంగాధరరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది. శిబిరంలో 192 మంది రోగులకు వద్యులు వివిధ రోగాలకు పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ చీకటి భారవి, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ గుడిపూడి రాజేష్ వైద్య సేవలను అందించారు. శరత్ మాక్స్‌విజన్ వారు కంటి పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో ఏటుకూరి రామారావు, మంకెనపల్లి నర్సింహారావు, షేక్.అబ్దుల్, సామాల మల్లికార్జున్, దండా సూర్యనారాయణ, అబ్దుల్ రహీం, నాగేశ్వరరావులు వాలంటీర్లుగా వ్యవహరించారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

గుండెపోటుతో సీపీఐ సానుభూతిపరుడి మృతి

ఖమ్మంచర్చికాంపౌండ్, జనవరి12 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం పట్టణం పాదురంగాపురానికి చెందిన సీపీఐ సానుభూతిపరుడు చామకూరి నాగభూషణం (70) ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు, జమ్ముల జితేదర్‌రెడ్డి, కార్పొరేటర్ దండా జ్యోతిరెడ్డి తదితరులు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. నాగభూషణం కుటుంబసభ్యులను పరామర్శించి తమప్రగాఢ సానుభూతి తెలిపారు.

శ్రీవైష్ణవ సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ఖమ్మం సాంస్కృతికం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా శ్రీవైష్ణవ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం ఖమ్మం ఎన్నెస్పీ క్యాంపు రామాలయం లో జరిగింది. కార్యక్రమంలో శ్రీవైష్ణవ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు కోదండ రామాచార్యులు, వేదాంతం రాఘవాచార్యులు, పద్మజ, రోహిణి, చూడామణి,పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా శ్రీవైష్ణవ మహిళా సంక్షేమ సం ఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

'మునిసిపల్ పేదలకు ఆత్మీయ భరోసా అందించాలి'

వైరా, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీల పరిధిలోని పేదలకు కూడా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని వర్తింపజేయాలని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. వైరాలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైరా మునిసిపాలిటీ పరిధిలోని పేదలందరికీ ఈజీఎస్ జాబ్‌కార్డులివ్వాలన్నారు.

'శ్రీచైతన్య' ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ



ముగ్గులను పరిశీలిస్తున్న డైరెక్టర్ శ్రీవిద్య

ఖమ్మం ఖానాపురంహవేలి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీచైతన్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విద్యాసంస్థలకు చెందిన మహిళా ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విద్యా సంస్థల డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య హాజరై ముగ్గుల పోటీలను ప్రారంభించి మాట్లాడారు. భారతీయ సాంప్రదాయంలో రంగవల్లులు ముఖ్యమైన సాంప్రదాయమని, కళాత్మకత, సృజనాత్మకతలే ఇమిడి ఉంటాయన్నారు. పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు.

ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ సాయిగీతిక, చింతనిప్పు శ్రీదేవి, సీహెచ్ బ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ముగ్గుల పోటీలు

ఖమ్మం రూరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండలలోని వివిధ గ్రామాల్లో సంక్రాంత్రి పండుగను పురస్కరించుకుని ఆదివారం ముగ్గుల పోటీలను పెద్ద ఎత్తున నిర్వహించారు. వరంగల్ క్రాస్‌రోడ్డులో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలను రూరల్ ఎస్‌హెచ్‌వో ముష్కరాజు ప్రారంభించారు. కామంచికల్ గ్రామంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలను సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్ ప్రారంభించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయాగ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.



ముగ్గుల పోటీలు ప్రారంభిస్తున్న సీఐ

సీతారామచంద్రస్వామి ఆలయంలో పూజలు

సత్తుపల్లిరూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ధనుర్మా సం సందర్భంగా కూడారై మహోత్సవం ఆదివారం మం డలంలోని రేజర్లలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. 108గంగాలములతో దివ్యపాయస నివేదన స్వామికి సమర్పించారు. కార్యక్రమంలో ప్రవచనకర్త నల్లాన్ రామకృష్ణమాచార్య, ఒగ్గు పుల్లారెడ్డి, వసంతలక్ష్మీ, భీమిరెడ్డి నరసింహారెడ్డి, గొర్ల శ్రీనివాసరెడ్డి, చింతల వెంకటరామిరెడ్డి, బాలకృష్ణారెడ్డి, రాఘవరెడ్డి, కృష్ణస్వామి, రామారావు, బాబూరావు పాల్గొన్నారు.

గీతామందిరంలో ఊరేగింపు

పట్టణంలోని గీతామందిరం భక్తబృందం ఆధ్వర్యంలో శ్రీ గోదాదేవి అమ్మవారికి సారె నింపేందుకు మేళతాలాల నడుమ భక్తులు పసుపు, కుంకుమ, చలివిడి, లడ్డూలు సారె సామాగ్రితో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమం లో కొత్తూరు రాజేశ్వరరావు, తిరునగరి వెంకటనర్సయ్య, ఏపూరి పురుషోత్తం, బాలలీలాకృష్ణ, పుష్పావతి, సత్యవ తి, లక్ష్మీ, శ్రీదేవి, శారద, లీలాజ్యోతి భక్తులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐ ఫౌండేషన్, రోటరీ క్లబ్‌ఆధ్వర్యంలో.. సేవా కార్యక్రమాలు

ఖమ్మం సాంస్కృతికం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): డిస్ట్రిక్ ఎన్ఆర్ఐ ఫౌండేషన్, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మం గట్టయ్య సెంటర్‌లోని రోటరీ లింబ్ సెంటర్‌లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. 23 మంది దివ్యాంగులకు కృత్రిమ పాదాలు, 10 మంది మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ, 6 గురు దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్‌అధ్యక్షుడు నల్లమోతు రవీందర్ నాథ్, వైస్ చైర్మన్ కాళ్ల పాపారావు, కార్యదర్శి దొడ్డపనేని సాంబశివరావు, గిరిజ హరినాథ్, సామినేని రవికుమార్, శావలి సునీల్ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై రైతులకు పీఎస్‌బీ అందజేత

రఘునాథపాలెం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రఘునాథపాలెం మండల పరిధిలో జాతీయ ఆహారభద్రత పథకం కింద వరి, పెసర పంటలు సాగు చేస్తున్న రైతులకు 50శాతం సబ్సిడీతో ఫాస్పరస్ సాల్యుబులైజింగ్ బ్యాక్టీరియా(పీఎస్‌బీ)ని ఆదివారం ఖమ్మం డివిజన్ ఏడీఏ కొంగర వెంకటేశ్వరరావు, మండల వ్యవసాయ అధికారి కే.ఉమా మహేశ్వరరావు అందజేశారు. ఏడీఏ మాట్లాడుతూ పీఎస్‌బీ వాడటం వల్ల భూమిలో భాస్వరాన్ని కరిగించి మొక్కలను అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రఘునాథపాలెం క్లస్టర్ ఏఈవో ప్రతిభ, రైతులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారుడికి సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న మేయర్ నీరజ

ఖమ్మం సంక్షేమవిభాగం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): వివిధ అనారోగ్య కారణాలతో ఆస్పత్రుల్లో చికిత్సలు పొందినవారికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను నగర మేయర్ పునుకొల్లు నీరజ ఆదివారం బాధితులకు అందజేశారు. నగరంలోని 26వ డివిజన్ సుగ్గలవారి తోటలో జరిగిన ఈ కార్యక్రమంలో మేయర్ మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా అందజేస్తున్నామన్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందించటమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకే ధరఖాస్తు చేసుకున్న వెంటనే సీఎంఆర్ఎఫ్ ద్వారా నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

వివేకానంద జీవితం యువతకు ఆదర్శం

జయంతి కార్యక్రమంలో వక్తలు

ఖమ్మం స్పోర్ట్స్/ఖమ్మం బైపాస్‌రోడ్డు/కూసుమంచి/నేలకొండపల్లి జనవరి 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని సర్ధార్‌పటేల్ స్టేడియంలో ఆదివారం స్వామీవివేకానంద 162వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానందుని ఆశయాలకు అనుగుణంగా యువత నడుచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మేనేజర్ ఉదయ్‌కుమార్, అథ్లెటిక్స్ కోచ్ గౌస్, సిబ్బంది హరిబాబు, చందన, అంబిక, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంబైపాస్‌రోడ్ (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆధ్వర్యంలో నగరంలోని ఇల్లెందు క్రాస్‌రోడ్డు వద్ద వివేకానంద విగ్రహానికి బీజేపీ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత దేశానికి వెన్నుముకగా నిలబడగలదని స్వామి వివేకానంద చాటిచెప్పారని కొనియాడారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి శ్యామ్‌రాథోడ్, రవికుమార్, మంద సరస్వతి, చావా కిరణ్, అనంతు ఉపేందర్‌గౌడ్, రాఘవ, రామకృష్ణ, పాల్గొన్నారు.

కూసుమంచి(ఆంధ్రజ్యోతి): వజ్రసంకల్పం ఉన్న యువత దేశానికి అవసరమని తన బోధనలతో యువతలో స్ఫూర్తినింపిన వ్యక్తి స్వామి వివేకానంద అని బీజేపీ జిల్లా నాయకులు గుండా ఉపేందర్‌రెడ్డి తెలిపారు. కూసుమంచిలో ఆదివారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గుండా విజయపాల్‌రెడ్డి, సామాజిక సేవకులు రవీంద్రనాథ్‌ఠాగూర్, కొక్కిరేణి నరేష్ విక్రం తదితరులు పాల్గొన్నారు.

నేలకొండపల్లి (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకుని నేటి యువత ముందుకు సాగాలని మైనార్టీ మోర్చా రాష్ట్ర నాయకుడు షేక్.షర్ఫుద్దీన్ పిలుపునిచ్చారు. స్వామి వివేకానంద జయంతిని యువజనోత్సవంగా జరుపుకోవటం యువతఅదృష్టమన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్, నాయకులు నర్సింహారావు, గోపి, వెంకటరెడ్డి, వెంకటేష్, దివాకర్, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



వివేకానందుని చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి

ప్రమాదకరంగా మూలమలుపులు

హెచ్చరిక బోర్డు లేని దృశ్యం
పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు

తిరుమలాయపాలెం, జనవరి12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి. ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకునేవారు కరువయ్యారు. కనీసం ప్రమాదం జరిగే ప్రాంతంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయలేదు. మండలంలోని బీరోలునుంచి కాకరవాయి వెళ్లే గ్రామం వరకు మూలమలుపులు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి. బీరోలు-ఏలువారిగూడెం మధ్య మలుపు ప్రమాదకరంగా మారింది. ఈ మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించని పరిస్థితి. దీంతో పలుప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే బచ్చోడు-బంధంపల్లి గ్రామాల మధ్య మూలమలుపు, జూపెడ-కాకరవాయి గ్రామాల మధ్య మూలమలుపు ప్రమాదకరంగా ఉంది. రఘునాథపాలెం, సుబ్లేడు గ్రామాల మధ్య మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. దమ్మాయిగూడెంనుంచి సుబ్లేడు వరకు, పాతర్లపాడు-హైదరసాయిపేట వరకు వెళ్లే మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈప్రాంతాల్లో ఎలాంటి ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయలేదు.

ప్రజలు సంబంధిత అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండాపోయింది. అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



హైదర్‌సాయిపేట-పాతర్లపాడు గ్రామాల మధ్య ప్రమాదకరంగా ఉన్న మలుపు

దరఖాస్తుల ఆహ్వానం

కారేపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రేలకాయలపల్లిలో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ తన్నీరు నాగేశ్వరరావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈనెల31వరకు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఫిబ్రవరి 28న ప్రవేశపరీక్ష నిర్వహిస్తారన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

కామన్ ఎంట్రెన్స్ టెస్టు

అవగాహన పోస్టర్ ఆవిష్కరణ

వైరా, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సంస్థ 2025కు చెందిన ఐదోతరగతి కామన్ ఎంట్రెన్స్ పరీక్ష అవగాహన పోస్టర్‌ను ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ ఆదివారం ఆవిష్కరించారు. వైరాలోని ఆసంస్థకు చెందిన గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డి.సమత ఆధ్వర్యంలో ఐదోతరగతి పరీక్షల అవగాహన పోస్టర్‌ను జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఆలనా లేదు..పాలనా లేదు

» అభివృద్ధికి ఆమడదూరంలో అన్నాయపాలెం గ్రామం

మధిర రూరల్, జనవరి12(ఆంధ్రజ్యోతి): ఏళ్లు గడుస్తున్నా.. ప్రభుత్వాలు మారుతున్నా ఈ గ్రామం వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. ఓట్లు వేయించుకోవడానికి మాత్రమే వస్తుంటారని మిగతా రోజుల్లో తమ గోడు ఆలకించేవారే కరువయ్యారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది మధిర మునిసిపాలిటీ పరిధిలోని మడుపల్లి గ్రామ ఆరోవార్డు పరిధిలోగల శివారు గ్రామం అన్నాయపాలెం దుస్థితి.

అంతర్రాష్ట్ర సరిహద్దులో శివారు గ్రామం అన్నాయపాలెం...

మధిర మునిసిపాలిటీ మడుపల్లి పరిధిలోని ఆరోవార్డులో ఈ అన్నాయపాలెం గ్రామాన్ని చేర్చారు. ఈ గ్రామం ఆంధ్రా-తెలంగాణ రాష్ట్ర సరిహద్దులో చివరిగా ఉంటుంది. మడుపల్లి నుంచి ఈ గ్రామం ఐదుకిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఈ గ్రామంలో మొత్తం జనాభా 200 మంది ఉండగా ఓటర్లు 120మంది ఉన్నారు.



నిరుపయోగంగా ఉన్న వాటర్‌ట్యాంకు

గ్రామంలో సమస్యల తిష్ఠ...

గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల మూతపడింది మినీ వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా మారింది. ఓ వీధిలో విద్యుత్ స్తంభాలకు వీధిలైట్లు ఏర్పాటుచేయలేదు. సైడ్‌కాల్వలు అధ్వానంగా తయారయ్యాయి. గ్రామంలో ఒకే ఒక్క మంచినీటి బోర్ ఉండటంతో ప్రజలందరూ అక్కడికే వెళ్లి నీరు పట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. అర్హులైన పేదలు, దివ్యాంగులకు పింఛన్లు రాక అవస్థలు పడుతున్నారు. గ్రామంలో పాఠశాల లేకపోవడంతో పక్కనున్న ఆంధ్రా ప్రాంతానికి పిల్లలను పాఠశాలలకు పంపిస్తున్నారు. అయితే రేషన్ కోసం కానీ, ఇతర ప్రభుత్వ పథకాల కోసం కానీ దూరంలో ఉన్న మడుపల్లికి వెళ్లాలంటే వీరు పడే ఇబ్బందులు అన్నీఇన్నీ కావు.

దేశినేనిపాలెం పంచాయతీలో గ్రామాన్ని కలపాలి

శివారులో ఉన్న తమ గ్రామంలోని ప్రజలకు ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు అందడం లేదని, మునిసిపాలిటీ నుంచి తమను తొలగించి తమ అరకిలోమీటర్ దూరంలోగల దేశినేనిపాలెం గ్రామపంచాయతీలోకి అన్నాయపాలెం గ్రామాన్ని కలపాలని, ఈ పంచాయతీలో కలిపితే తమకు సౌకర్యవంతంగా ఉంటుందని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని వారు కోరుతున్నారు.



అన్నాయపాలెం గ్రామంలో మూతపడిన ప్రభుత్వ పాఠశాల (స్తంభాలకు వీధిలైట్లు లేని దృశ్యం)

మా గ్రామాన్ని పట్టించుకోవడం లేదు..

● కంభంపాటి ఊహా, అన్నాయపాలెం



తమ గ్రామం రెండు రాష్ట్రాల సరిహద్దులో చివర్లో ఉంది. మేము రోడ్డు దాటి రెండు గజాలు అడుగు వేస్తే పక్కనే ఆంధ్రాలోని జొన్నలగడ్డ గ్రామం. అంతా దళిత నిరుపేదలమే. ప్రజాప్రతినిధులు ఓట్లప్పుడే వస్తారు కానీ మిగతాప్పుడు కంటికి కూడా కనపడరు. తమ గ్రామాన్ని దేశినేనిపాలెం పంచాయతీలో కలపాలి.

పింఛన్లు రాక ఇబ్బందులు పడుతున్నాం..

● కంభంపాటి చిన్నప్రభాకర్, అన్నాయపాలెం



తమ గ్రామానికి ప్రభుత్వ పథకాలు అందడం లేదు. పట్టించుకొనే వారే కరువయ్యారు. తనకు అన్ని అర్హతలు ఉన్నా పింఛన్ రాక అవస్థలు పడుతున్నాం. తమ గ్రామం మడుపల్లి పరిధిలో ఉంది. మడుపల్లి తమకు చాలా దూరం. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమ గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలి.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం

» ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదల అభివృద్ధి, సంక్షేమం సిద్ధిస్తుందని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలకు చెందిన 240మంది బాధితులకు సీఎం సహాయనిధి కింద రూ.78.11లక్షల చెక్కులను ఆదివారం వైరాలోని తమ క్యాంపు కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో కలిసి పంపిణీ చేశారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఏదునూరి సీతరాములు, వడ్డే నారాయణ, స్వర్ణ నరేంద్ర, చంద్ర ప్రకాశ్, మంగీలాల్‌నాయక్, సూరంపల్లి రామారావు, మిట్టపల్లి నాగి, రాజశేఖర్, సురేష్, తదితరులున్నారు.

'కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ కృషి'

కారేపల్లి, జనవరి12(ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ వేదిక అని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్‌రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని భాగం రామనర్సయ్య భవనంలో కేలోత్ రవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పలువురికి సభ్యత్వం అందజేశారు. సంఘం మండల పెయింటర్స్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా శివ, పాషా, ఉపాధ్యక్షుడిగా సుమన్, సహాయ కార్యదర్శిగా సుదర్శన్, కోశాధికారిగా ప్రవీణ్‌కుమార్, అనంతరాములు, వీరేందర్, రాంబాబు, సాంబశివరావులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో దోనేజు లక్ష్మణాచారి, మేడికొండ నాగేశ్వరరావు, రవి,శనగరాంబాబు, కొండబోయిన నాగేశ్వరరావు, కె.నరేందర్, ముక్క సీతారాములు, శివ తదితరులున్నారు.

'అందరికీ ఆత్మీయ భరోసా అందించాలి'



మాట్లాడుతున్న భూక్యా వీరభద్రం

వైరా, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీల పరిధిలోని పేదలకు కూడా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని వర్తింపజేయాలని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. వైరాలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైరా మునిసిపాలిటీ పరిధిలోని పేదలందరికీ ఈజీఎస్ జాబ్‌కార్డులివ్వాలని, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేయాలని కోరారు. సమావేశంలో సుంకర సుధాకర్, చింతనిప్పు చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఏన్కూరు, జనవరి12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంపై పెద్దఎత్తున పోరాటాలు చేయడానికి సీపీఎం పార్టీ ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తుందని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా వీరభద్రం అన్నారు. ఆదివారం మండల కేంద్రం లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

సంతోషాలతో సంక్రాంతి జరుపుకోవాలి

» మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



మాజీ ఎమ్మెల్యే కట్టా వెంకటనర్సయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సండ్ర

సత్తుపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రజలంతా సుఖసంతోషాలతో సంక్రాంతి పర్వదినాన్ని జరుపుకోవాలని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆకాంక్షించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజల అవసరాలను తీర్చిందని, ముఖ్యంగా సాగునీటిపై దృష్టి సారించి వ్యవసాయాన్ని పండుగ చేసిందన్నారు.

సత్తుపల్లి బీఆర్ఎస్ పార్టీ, నందమూరి బాలకృష్ణ యువసేనల ఆధ్వర్యంలో వేర్వేరుగా రూపొందించిన నూతన సంవత్సరం-2025క్యాలెండర్లను తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన రేజర్లకు చెందిన కన్నంతరెడ్డి శ్రీనివాసరెడ్డిని పరామర్శించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కూసంపూడి రామారావు, కొత్తూరు ఉమామహేశ్వరరావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, అద్దంకి అనిల్, నరుకుళ్ల శ్రీను, నడ్డి ఆనందరావు, మల్లూరు అంకంరాజు, వల్లభనేని పవన్, పర్వతనేని వేణు తదితరులున్నారు.

కట్టా వెంకటనర్సయ్య ఆశయాలు సాధించాలి

కల్లూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా జీవితంలో మధిర మాజీ ఎమ్మెల్యే సర్గీయ కట్టా వెంకటనర్సయ్య చురుకైన పాత్ర వహించారని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. మండల పరిధిలోని పోచారం గ్రామంలో కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం వెంకటనర్సయ్య 4వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కట్టా విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే సండ్రతో పాటు పలువురు నాయకులు నివాళులర్పించారు. ఆయా పార్టీలకు చెందిన నాయకులు ఉమ్మినేని కోటయ్య, తాత భాస్కరరావు, కట్టా గాంధీ, పాలెపు రామారావు, నర్వనేని అంజయ్యలు ప్రసంగించారు. మధిర నియోజకవర్గం అభివృద్ధికి ఎంతోగాను బోడేపూడి బాటలో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా కట్టా కుటుంబ సభ్యులైన మాజీ జడ్పీటీసీ అజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజాజీవితంలో తన తండ్రి చూపిన బాటలో తాను ప్రజల కోసం సేవలందిస్తునే ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు కట్టా సతీమణి సుగుణమ్మ, సోదరుడు కట్టా గాంధీ, కట్టా సత్యం, సొసైటీ చింతలపూడి బారిష్టార్, తాళ్లూరి శ్రీనివాసరావు, చావా వీరభద్రం పాల్గొన్నారు.

ఆమ్‌ఆద్మీ సభ్యత్వ నమోదు

వైరా, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): వైరాలో ఆదివారం ఆమ్‌ఆద్మీ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు స్వర్ణ సుబ్బారావు వైరా బస్టాండ్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు వర్గాల వారికి ఆమ్ ఆద్మీ పార్టీ సభ్యత్వాలను అందజేశారు. వైరా నియోజకవర్గ ఇన్‌చార్జి గుత్తా నాగేశ్వరరావు, మీడియా ఇన్‌చార్జి సంగమేశ్వరప్రసాద్ పాల్గొన్నారు.

పెనుబల్లి బీజేపీ మండల అధ్యక్షుడిగా నర్సింహారావు



పెనుబల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతాపార్టీ పెనుబల్లి మండల అధ్యక్షుడిగా బొర్రా నర్సింహారావు రెండోసారి నియమితులయ్యారు. ఆయన ఆధ్వర్యంలో మండలంలో పార్టీని బలోపేతం చేస్తూ ముందుకు సాగుతున్నారని గుర్తించి, ఆయనను రెండోసారి నియమించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు ఈవీ.రమేష్, జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఏకలవ్య స్కూళ్లకు దరఖాస్తుల ఆహ్వానం

కారేపల్లి, జనవరి12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రేలకాయలపల్లిలో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశాలకు ప్రభుత్వం ఆదివారం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ తన్నీరు నాగేశ్వరరావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈనెల31వరకు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఫిబ్రవరి 28న ప్రవేశపరీక్ష నిర్వహిస్తారన్నారు.

పాఠశాలల్లో సంక్రాంతి వేడుకలు



వైరాలోని ఠాగూర్ విద్యాసంస్థలో భోగిమంటలు వేస్తున్న దృశ్యం



తల్లాడలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

మంత్రి పొంగులేటిని కలిసిన మిత్ర బృందం



నారాయణపురంలో మిత్రబృందంతో మంత్రి పొంగులేటి

కల్లూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఆదివారం నారాయణపురంలో బాల్య మిత్రులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. కల్లూరు ప్రభుత్వం జూనియర్ కళాశాలలో మం త్రి పొంగులేటితో కలిసి 1983-84 ఇంటర్మీడియ ట్ చదివిన నాటి బాల్య మిత్రులు బొగ్గుల రామిరెడ్డి (హౌసింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి), సంఘం వెంకటపుల్లయ్య (భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు), పెద్దబోయిన శ్రీనువాసరావు, అమీరుద్దీన్ నాగేంద్రబాబు, దోసపాటి శ్రీను, ఉస్మాన్ బేగ్, సుందరరావు, పసుమర్తి శ్రీను, కేవి చారి, రాము, తదితరులు కలిశారు. ఈ సందర్భంగా తనతో పాటుగా చదివిన బాల్య మిత్రులను పేరు పేరునా పలకరించారు. మిత్రులు కూడా మంత్రి పొంగులేటికి ప్రజా జీవితంలో తమ బాల్య మిత్రుడు ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. అంతకు మందు మంత్రి పొంగులేటిని వారు శాలువలతో సత్కరించారు.

కామన్ ఎంట్రెన్స్ టెస్టు అవగాహన పోస్టర్ ఆవిష్కరణ

వైరా, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సంస్థ 2025కు చెందిన ఐదోతరగతి కామన్ ఎంట్రెన్స్ పరీక్ష అవగాహన పోస్టర్‌ను ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ఆదివారం ఆవిష్కరించారు. వైరాలోని ఆసంస్థకు చెందిన గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డి.సమత ఆధ్వర్యంలో ఐదోతరగతి పరీక్షల అవగాహన పోస్టర్‌ను జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

తాన్లా ఫౌండేషన్ సేవలు అభినందనీయం

» కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్

సత్తుపల్లిరూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): గంగారం కేంద్రంగా చుట్టుపక్కల గ్రామాలలో తాన్లా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవలు అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ అన్నారు. సంక్రాంతి ఉత్సవం-2025సందర్భంగా గంగారంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన వాలీబాల్, రంగోలి, గాలిపటాల పోటీలలో విజేతలకు ఆదివారం బహుమతులను అందజేశారు. జగన్నాథపురంపై రుద్రాక్షపల్లి జట్టు వాలీబాల్‌లో గెలుపొందారు. కార్యక్రమంలో తాన్లా సెక్రటరీ అనురాధ, డాక్టర్ నరేంద్రనాద్, మందపాటి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావు ఆశయాలు సాధించాలి

ముదిగొండ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం మల్లన్నపాలెం మాజీ సర్పంచ్ కోలేటి శ్రీనివాసరావు శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన అంత్యక్రియలను ఆదివారం నిర్వహించారు. శ్రీనివాసరావు మృతదేహానికి మాజీ జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించి, అంతిమయాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వాచేపల్లి లక్ష్మారెడ్డి, నాయకులు పోట్ల వెంకటప్రసాద్, గడ్డం వెంకటేశ్వర్లు, బంకా మల్లయ్య, సెల్వరాజ్, కోటి అనంతరాములు, కొమరయ్య, ధనియాకుల వీరస్వామి పాల్గొన్నారు.

విద్యావేత్త సత్తిరెడ్డికి ఘన సన్మానం



సత్యనారాయణరెడ్డి దంపతులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ఎర్రుపాలెం, జనవరి12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సర్దార్ జమలాపురం కేశవరావు మెమోరియల్ కళాశాల అధినేత దండెం సత్యానారాయణరెడ్డి(సత్తిరెడ్డి)నికళాశాల పూర్వవిద్యార్థులు ఆదివారం ఘనంగా సన్మానించారు కళాశల రజతోత్సవం సందర్భంగా సత్తిరెడ్డి పదవీ విమరణ సన్మానకార్యక్రమాన్ని పూర్వవిద్యార్థులు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులను ప్రోత్సహించేందుకు పేద విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఈ కళాశాలను స్థాపించారన్నారు. గత 25 ఏళ్లగా కళాశాలను సేవా దృక్పథంతో నాణ్యమైన విద్యనందిస్తున్నారని తెలిపారు. ఈసందర్భంగా పలువురు సత్తిరెడ్డి సేవలను కొనియాడారు. ఈకార్యక్రమంలో కాకతీయ యూనివర్శిటీ రిటైర్డు ప్రొఫెసర్ నర్సింహారావు, ఆకాష్ ఐఏఎస్ అకాడమి డైరెక్టర్ యాదవరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ జమలాపురపు గోపాల్ కిషన్‌రావు, డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, కళాశల యాజమాన్యం ఎన్.సౌజన్య, శ్యామ్‌ప్రసాద్, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సీతారామచంద్రస్వామి ఆలయంలో పూజలు



రేజర్లలో కూడారై ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

సత్తుపల్లిరూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం సందర్భంగా కూడారై మహోత్సవం ఆదివారం మండలంలోని రేజర్లలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రవచనకర్త నల్లాన్ రామకృష్ణమాచార్య, ఒగ్గు పుల్లారెడ్డి, వసంతలక్ష్మీ, భీమిరెడ్డి నరసింహారెడ్డి, గొర్ల శ్రీనివాసరెడ్డి, చింతల వెంకటరామిరెడ్డి, బాలకృష్ణారెడ్డి, రాఘవరెడ్డి, కృష్ణస్వామి, రామారావు, బాబూరావు పాల్గొన్నారు.

గీతామందిరంలో ఊరేగింపు

పట్టణంలోని గీతామందిరం భక్తబృందం ఆధ్వర్యంలో శ్రీ గోదాదేవి అమ్మవారికి సారె నింపేందుకు మేళతాలాల నడుమ భక్తులు పసుపు, కుంకుమ, చలివిడి, లడ్డూలు సారె సామాగ్రితో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో కొత్తూరు రాజేశ్వరరావు, తిరునగరి వెంకటనర్సయ్య, ఏపూరి పురుషోత్తం, బాలలీలాకృష్ణ, పుష్పావతి, సత్యవతి, లక్ష్మీ, శ్రీదేవి, శారద, లీలాజ్యోతి భక్తులు పాల్గొన్నారు.

ఎంపీ ప్రియాంకగాంధీ జన్మదిన వేడుకలు



వైరాలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్

వైరా/మధిరటౌన్/తల్లాడ/పెనుబల్లి/కల్లూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): వయనాడ్ ఎంపీ, ఏఐసీసీ జనరల్ సెక్రటరీ ప్రియాంకగాంధీ జన్మదిన వేడుకలను ఆయా మండలాల్లో, పట్టణాలల్లో నిర్వహించారు. వైరాలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ కేక్ కట్‌చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. మధిరలో అమ్మ పౌండేషన్ చైర్మన్ మల్లు నందిని కేక్ కట్ చేశారు.



మధిరటౌన్‌లో కేక్ కట్ చేస్తున్న మల్లు నందిని

స్వామి వివేకానంద జయంతి



ఏన్కూర్‌లో స్వామి వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బొర్రా తిరుపయ్య

వైరా, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపూడి గ్రామంలో ఆదివారం స్వామి వివేకానందుని 162వ జయంతి వేడుకలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ మేడూరి రామారావు, షేక్.సైదా, జీవీ.సూర్యప్రకాశరావు, పి.భాస్కర్‌రావు, మిడిదొడ్డి వెంకటేశ్వర్లు, మిట్టపల్లి సతీష్, పోరళ్ల కృష్ణ, కొత్తపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఏన్కూరు, జనవరి12(ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద జయంతిని ఆదివారం తిమ్మరావుపేట గ్రామంలో నిర్వహించారు. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ రవాణా అధికారి బొర్రా తిరుపయ్య స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వామి వివేకానంద ఆశయసాధన కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని కోరారు. యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కొనకంచి రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ లచ్చిరాంనాయక్, కోటాచారి, వెంకటి, అయోధ్య, రాఘవులు పాల్గొన్నారు.



గోకినపల్లిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న 1993-94 పూర్వవిద్యార్థులు



కొణిజర్ల సమ్మేళనంలో పాల్గొన్న 2005-06 విద్యార్థులు



తల్లాడ సమ్మేళనంలో పాల్గొన్న 2000-01 పూర్వ విద్యార్థులు



పినపాక సమ్మేళనంలో పాల్గొన్న 1993-94 పూర్వ విద్యార్థులు